www.prajanaava.in
Telugu Daily
# ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పేజీలు : 08 | వెల రూ.5.00

ప్రజానావ
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
✆ : 99484 33277 / 9014966169

Published from: Hyderabad, Rangareddy, Karimnagar Circulated to: Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad
హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 193 | బుధవారం | 8 జులై, 2026



# వామ్మో ట్రాఫిక్

ఢిల్లీ–జైపూర్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్–48)పై నర్సింగ్‌పూర్ సమీపంలో ప్రధాన రహదారి ఒక్కసారిగా కుంగిపోవడంతో రెండు లేన్లను అధికారులు తాత్కాలికంగా మూసివేశారు. దీంతో రాజీవ్ చౌక్ నుంచి ఖేర్కీ దౌలా టోల్‌ప్లాజా వరకు సుమారు ఎనిమిది కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ ఘటన మంగళవారం మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల మధ్య చోటుచేసుకుంది. అధికారుల వివరాల ప్రకారం.. ఈ ప్రాంతంలో గురుగ్రామ్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (జీఎండీఏ) చేపడుతున్న డ్రైనేజీ పైపుల నిర్మాణ పనుల కారణంగా రహదారి అడుగు భాగంలోని మట్టి బలహీనపడింది. ఇదే సమయంలో కురిసిన భారీ వర్షాలకు నీరు లోనికి చేరడంతో రహదారి కుంగిపోయినట్లు తెలిపారు. మరమ్మతు పనులను పూర్తిచేసినప్పటికీ, భద్రతా కారణాల దృష్ట్యా ప్రభావిత లేన్లను అధికారులు తాత్కాలికంగా మూసివేశారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, పూర్తిస్థాయిలో భద్రత నిర్ధారించిన తర్వాతే రహదారిని తిరిగి వాహనాల రాకపోకల కోసం తెరవనున్నట్లు అధికారులు వెల్లడించారు.



## సీజేపీ 'ఎక్స్' ఖాతా పునరుద్ధరించాలి

- కేంద్ర ప్రభుత్వానికి ఢిల్లీ హైకోర్టు ఆదేశం
- నీట్ పరీక్ష ముగిసిన నేపథ్యంలో నిషేధానికి ఇక అవసరం లేదన్న న్యాయస్థానం
- సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే పిటిషన్‌పై తీర్పు

2

## రామాయణ కాలం నుంచే భారత్–ఇండోనేషియా బంధం

- పార్లమెంటులో ప్రసంగించిన ప్రధాని మోదీ
- మోదీ పథకాలు కాపీకొట్టామన్న అధ్యక్షుడు
- మిత్రుల మధ్య కాపీరైట్ ఉండదన్న ప్రధాని

2

# కాళేశ్వరం కమీషన్ల ప్రాజెక్టు

## కేసీఆర్ ఎప్పుడు లెటర్ రాస్తే అప్పుడే కాళేశ్వరంపై అసెంబ్లీలో ప్రత్యేక చర్చ ఏర్పాటు చేస్తాం

- ప్రతిపక్ష నేతగా ఎంత మాట్లాడాలనుకుంటే అంత సమయమిస్తాం
- వాదన సరైనదైతే.. ప్రాజెక్టు నిర్వహణ సైతం అప్పగిస్తాం
- నిపుణుల సలహాలు పక్కన పెట్టడంతోనే సమస్యలు
- కేటీఆర్, హరీశ్‌రావులు ఆర్థిక ఉగ్రవాదులు: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**ప్రజానావ, హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్టును ప్రజల అవసరాల కోసం కాకుండా కమీషన్ల కోసం రీ డిజైన్ చేశారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు బహిరంగ సవాల్ విసురుతూ, కాళేశ్వరం అంశంపై ప్రత్యేకంగా అసెంబ్లీ సమావేశాలు నిర్వహించేందుకు తమ ప్రభుత్వం ఎప్పుడైనా సిద్ధంగా ఉందన్నారు. కేసీఆర్ లేఖ రాస్తే వెంటనే ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తామని, ప్రతిపక్ష నాయకుడిగా ఆయన ఎంతసేపైనా మాట్లాడేందుకు అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు. ప్రజాభవన్‌లో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ లోపాలు, రీడిజైన్, వ్యయభారం, సాంకేతిక అంశాలపై నిర్వహించిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లో ముఖ్యమంత్రి మాట్లాడారు. కేసీఆర్ తన వాదనను సాంకేతిక ఆధారాలతో నిరూపిస్తే, రాబోయే మూడేళ్లపాటు ప్రాజెక్టు మరమ్మతులు, నిర్వహణ బాధ్యతలను ఆయనకే అప్పగించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. అవసరమైతే తనకు నచ్చిన సంస్థకే కాంట్రాక్టు ఇచ్చుకోవచ్చని సవాల్ విసిరారు. రాష్ట్ర ప్రజల సొమ్మును కాపాడడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్న రేవంత్, ప్రస్తుతం ఏ నిపుణుల కమిటీ కూడా బ్యారేజీల్లో పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేయాలని సూచించలేదన్నారు. అలాంటి ప్రయత్నం చేస్తే బ్యారేజీల భద్రతకు ముప్పు ఏర్పడి, భద్రాచలం వరకు వరద ముప్పు పెరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఒక్క చుక్క నీటిని కూడా వినియోగించుకోకుండానే వేల కోట్ల రూపాయల అప్పుల భారాన్ని తమ ప్రభుత్వం భరిస్తోందన్నారు. నిపుణుల సలహాలను ప్రభుత్వం ఎప్పుడూ స్వాగతిస్తుందని, అయితే గత ప్రభుత్వ తప్పిదాల భారాన్ని ప్రజలు మోయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.



### నిపుణుల నివేదికలను పక్కకు..

కాళేశ్వరం ప్రాజెక్టు రూపకల్పనపై రిటైర్డ్ ఇంజినీర్ల కమిటీ అప్పుడే అభ్యంతరాలు వ్యక్తం చేసినా, ఆ నివేదికను అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదని రేవంత్ ఆరోపించారు. తమకు అనుకూలంగా నివేదికలు వచ్చేలా వ్యవహరించారని, నిపుణుల హెచ్చరికలను విస్మరించడమే ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితికి ప్రధాన కారణమని అన్నారు. రూ.38 వేల కోట్లతో చేపట్టాల్సిన ప్రాజెక్టు వ్యయం లక్ష కోట్ల రూపాయలకు పైగా తరువాయి 2లో..

## సింగరేణికి తాడిచర్ల బొగ్గు గని

- ప్రధాని మోదీ అంగీకారం
- సంతకం పూర్తిచేసిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- 40–50 ఏళ్ల పాటు ఏటా 6 మిలియన్ టన్నుల ఉత్పత్తికి అవకాశం
- రూ.64 వేల కోట్లకుపైగా సమకూరనున్న ఆదాయం
- ఒడిశా నైని కోల్ బ్లాక్‌తో మరో రూ.75 వేల కోట్ల రెవెన్యూ అవకాశాలు
- సింగరేణి అభివృద్ధికి కేంద్రం అండగా ఉంటుంది: కిషన్‌రెడ్డి వెల్లడి

2




## డిజిటల్ గవర్నెన్స్‌తో పారదర్శక పాలన

- ప్రజలకు వేగవంతమైన సేవలే ప్రభుత్వ లక్ష్యం
- కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఆన్‌లైన్ ద్వారా సకాలంలో జీతాల చెల్లింపు
- ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించని ఏజెన్సీలపై కఠిన చర్యలు: సీఎం రేవంత్‌రెడ్డి
- 100 రోజుల్లో సమగ్ర కార్యాచరణ రూపొందించాలని అధికారులకు ఆదేశం

2



## 2034 నాటికి కోటి మందిని కోటీశ్వరులను చేస్తాం

- మహిళల ఆర్థిక స్వావలంబన, చిన్నారుల పోషకాహారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం
- గర్భిణుల నుంచి ఆరేళ్ల పిల్లల వరకు పౌష్టికాహారం
- నర్సరీ నుంచి ఇంటర్ వరకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం
- సీఎం రేవంత్‌రెడ్డి
- నాచారంలో రూ.40 కోట్లతో నిర్మించిన బాలామృతం ప్లాంట్ ప్రారంభం

3

# డిజిటల్ గవర్నెన్స్‌తో పారదర్శక పాలన

**ప్రజానావ, హైదరాబాద్:** రాష్ట్రంలో పారదర్శక, జవాబుదారీతనంతో కూడిన పరిపాలన కోసం డిజిటల్ గవర్నెన్స్‌ను పూర్తిస్థాయిలో అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సేవలను మరింత వేగవంతంగా ప్రజలకు అందించడంతో పాటు సంక్షేమ పథకాల ప్రయోజనాలు నేరుగా లబ్ధిదారులకు చేరేలా సమగ్ర డిజిటల్ వ్యవస్థను రూపొందించాలని సూచించారు. మంగళవారం ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్‌లోని బోధి పెవిలియన్‌లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు, డిజిటల్ గవర్నెన్స్ అమలుపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో సీఎం అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సేవా వివరాలు, జీతాలు, బ్యాంకు ఖాతాల సమాచారాన్ని పూర్తిస్థాయిలో డిజిటలైజ్ చేయాలని సూచించారు. ఈ విధానం అమల్లోకి వస్తే ప్రతి నెల ఒకటో తేదీ నుంచి ఐదో తేదీలోగా ఉద్యోగుల ఖాతాల్లో పారదర్శకంగా జీతాలు జమ చేయడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. సమావేశంలో అధికారులు రాష్ట్రంలో సుమారు 4,800 కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలు పనిచేస్తున్నాయని, వాటిలో దాదాపు 4,300 ఏజెన్సీలు ఉద్యోగులకు ఈఎస్‌ఐ, పీఎఫ్ వంటి చట్టబద్ధ ప్రయోజనాలు కల్పించడం లేదని ముఖ్యమంత్రికి వివరించారు. ప్రభుత్వం నిధులు విడుదల చేసినప్పటికీ కొన్ని ఏజెన్సీలు ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించడం లేదని తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి, ఉద్యోగుల హక్కులను కాలరాస్తున్న ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. డిజిటల్ గవర్నెన్స్ అమలుతో ఇలాంటి అక్రమాలకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయాలని సూచించారు. డిజిటల్ పరిపాలన అమలుకు అవసరమైన చట్టాలు, విధివిధానాల రూపకల్పన కోసం వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. ఈ కమిటీ 100 రోజుల్లో సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగుల సేవా వివరాలు, హెల్త్ కార్డులు, ఇతర సంక్షేమ ప్రయోజనాలకు సంబంధించిన సమాచారాన్ని కూడా డిజిటల్ రూపంలో అందుబాటులోకి తీసుకురావాలని, మొత్తం వ్యవస్థను నిరంతరం పర్యవేక్షించేందుకు ఆర్థికశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక మానిటరింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని సీఎం పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎంపీ వేమ్ నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎం ప్రధాన కార్యదర్శి వి. శేషాద్రి, ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ వైస్ చైర్‌పర్సన్ శాంతికుమారి, వేతన సవరణ కమిషనర్ ఎన్. శివశంకర్, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ప్రణాళికాశాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# బీఎల్‌వోలను బెదిరిస్తున్న ఎంఐఎం

**ప్రజానావ, హైదరాబాద్ :** సర్ ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సీఈవోను బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు కోరారు. ఆయన ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని ఆ పార్టీ బృందం కలిసింది. ఈ సందర్భంగా సర్ ఖీ విషయంలో ఎంఐఎం పార్టీ వ్యవహరిస్తున్న తీరు సరిగ్గా లేదని రాంచందర్ రావు ఫిర్యాదు చేశారు. అనంతరం బీజేపీ తెలంగాణ చీఫ్ వూడియాతో మాట్లాడుతూ.. పలు ప్రాంతాల్లో బీఎల్‌వోలను ఎంఐఎం, కాంగ్రెస్ నేతలు బెదిరిస్తున్నారని తెలిపారు. ఇంటింటికీ వెళ్లకుండా బీఎల్‌ఓలను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. పలువురు ఓటర్లకు ఫారాలు అందడం లేదని రాంచందర్ రావు తెలిపారు.

# హ్యామ్ రోడ్లతో తెలంగాణకు కొత్త రూపు

- రూ.13 వేల కోట్లతో 6,092 కిలోమీటర్ల మేర 441 రహదారుల అభివృద్ధి
- ఇబ్రహీంపట్నం, మేడ్చల్, మహేశ్వరం ప్రాంతాల్లో రూ.338 కోట్లతో నాలుగు లేన్ల రహదారులకు శంకుస్థాపన



**ప్రజానావ, హైదరాబాద్/రంగారెడ్డి:** తెలంగాణ రాష్ట్ర రహదారుల నెట్‌వర్క్‌ను గతంలో ఎన్నడూ లేనంత ఆధునికంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం భారీ స్థాయిలో రహదారుల అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హ్యామ్ (హైబ్రిడ్ అన్యుటీ మోడల్) విధానంలో చేపట్టనున్న రహదారి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టడంతో రాష్ట్ర రోడ్ల రూపురేఖలు పూర్తిగా మారనున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రజలతో తనకు ఉన్న అనుబంధమే అభివృద్ధి కార్యక్రమాలకు ప్రేరణగా నిలుస్తోందని, ఈ ప్రాంత సమస్యలపై పూర్తి అవగాహనతో రహదారుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.13 వేల కోట్ల అంచనా వ్యయంతో 34 ప్యాకేజీల కింద మొత్తం 6,092 కిలోమీటర్ల మేర 441 రహదారులను హ్యామ్ విధానంలో అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. ఇటీవల నల్లగొండలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని గుర్తుచేసిన మంత్రి, ప్రమాదరహిత ప్రయాణానికి అనువుగా అత్యున్నత ప్రమాణాలతో రహదారులను నిర్మిస్తామని తెలిపారు. హైదరాబాద్ రూరల్ సర్కిల్–1, 2 పరిధిలోనే దాదాపు 30 ప్రధాన రహదారులను అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు.

### రూ.338 కోట్లతో నాలుగు లేన్ల రహదారులకు శ్రీకారం

ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, మేడ్చల్ నియోజకవర్గాల్లో రూ.338 కోట్ల వ్యయంతో 149 కిలోమీటర్ల మేర విస్తరించే 14 ఆధునిక నాలుగు లేన్ల రహదారుల నిర్మాణ పనులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. హైబ్రిడ్ అన్యుటీ మోడల్ విధానంలో చేపడుతున్న ఈ ప్రాజెక్టులు ప్రాంతీయ అభివృద్ధికి మైలురాయిగా నిలుస్తాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా మాత్రమే కాకుండా ఈ ప్రాంత ప్రజల మనిషిగా అద్దంలాంటి రహదారులను నిర్మించడమే తన లక్ష్యమని, మెరుగైన రహదారి అనుసంధానంతో పరిశ్రమలు, పెట్టుబడులు పెరిగి యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మరింత విస్తరిస్తాయని మంత్రి భరోసా ఇచ్చారు.

### అభివృద్ధికి పార్టీలకతీతంగా సహకారం అవసరం

శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిసి మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇప్పటికే రూ.85 కోట్ల విలువైన రహదారి పనులు పూర్తి చేశామని, మరో రూ.275 కోట్లతో పలు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అదనంగా రూ.100 కోట్ల విలువైన కొత్త రహదారి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, జాతీయ రహదారుల విస్తరణ వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తూ తెలంగాణను మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని స్పష్టం చేశారు.

### ఇబ్రహీంపట్నం అభివృద్ధికి మరింత ఊతం

పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో రూ.338 కోట్లతో 140కు పైగా రహదారి పనులు చేపట్టినట్లు తెలిపారు. గ్రామాలు, బస్తీల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై దృష్టి సారించిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌గా తీర్చిదిద్దుతున్నామని, లక్ష్మీ రెడ్డిపాలెం వద్ద ఫ్లైఓవర్, అండర్‌పాస్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి రూ.338 కోట్ల విలువైన రహదారి పనులు మంజూరు కావడం చారిత్రాత్మకమని, ఇందులో సుమారు రూ.275 కోట్ల పనులు నేరుగా నియోజకవర్గ పరిధిలోనే చేపడుతున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో 200 పడకల ఆసుపత్రి, ప్రభుత్వ పాఠశాలల ఆధునీకరణ, రహదారుల విస్తరణ వంటి అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని, రూ.2,300 కోట్లతో సమీకృత మార్కెట్ ఏర్పాటుతో వేలాది మందికి ఉపాధి అవకా శాలు లభించనున్నాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రభుత్వం సమాన ప్రాధాన్యత ఇస్తోందని, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రధాన రహదారు లను నాలుగు లేన్లుగా అభివృద్ధి చేయడం ద్వారా రవాణా సౌకర్యాలు మెరుగుపడటమే కాకుండా పెట్టుబడులు, పారిశ్రామిక అభివృద్ధి, ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థకు మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ చంద్రారెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# తాడిచర్లతో మరో 40 ఏళ్లపాటు ఢోకా లేదు

- కేంద్రానికి కృతజ్ఞతలు తెలిపిన డిప్యూటీ సీఎం భట్టి

**ప్రజానావ, హైదరాబాద్ :** సింగరేణికి తాడిచర్ల–2 బొగ్గు బ్లాక్‌ను కేంద్రం కేటాయించింది. ఈ నేపథ్యంలో ంద్ర ప్రభుత్వానికి తెలంగాణ ప్రభుత్వం కృతజ్ఞతలు తెలిపింది. మంగళవారం హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం కృషి ఫలించిందని అన్నారు. మరో 40 ఏళ్ల పాటు మైనింగ్‌కు అవకాశం ఉందని పేర్కొన్నారు. 340 మిలియన్ టన్నుల బొగ్గు వెలికితీతకు అవకాశం కలిగిందని చెప్పారు. తాడిచర్ల–2లో 434.14 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని వివరించారు. ఏడాదికి 10 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యంగా నిర్దేశిరచుకున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు. బ్లాక్‌లో జీ–9 గ్రేడ్ నాణ్యమైన బొగ్గు లభ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ బొగ్గు బ్లాక్ ద్వారా 3 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. దీని ద్వారా భూపాలపల్లి ప్రాంత అభివృద్ధికి భారీ ఊతం లభించినట్లు అయిందని అన్నారు. దీంతో రైలు, రోడ్డు మౌలిక వసతుల అభివృద్ధికి దోహదం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. విద్యుత్, పారిశ్రామిక రంగాలకు దీర్ఘకాలిక బొగ్గు భద్రత ఉంటుందని చెప్పారు. సింగరేణి 100 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యానికి ఇది బలంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# వయనాడ్‌లో కొండచరియల బీభత్సం

- సొరంగం నిర్మాణ స్థలంలో భారీ విపత్తు
- ముగ్గురు కార్మికుల మృతి
- ఏడుగురికి తీవ్రగాయాలు
- యుద్ధప్రాతిపదికన కొనసాగుతున్న సహాయక చర్యలు

**వయనాడ్/న్యూఢిల్లీ:** కేరళలోని వయనాడ్ జిల్లాలో మరోసారి ప్రకృతి బీభత్సం సృష్టించింది. సోమవారం రాత్రి నుంచి కురుస్తున్న ఎడతెరిపి లేని భారీ వర్షాల కారణంగా అనక్కంపొయిల్–కల్లాడి సొరంగం నిర్మాణ ప్రాంతంలో మంగళవారం ఉదయం భారీ కొండచరియలు విరిగిపడ్డాయి. కల్లాడిలోని మీనాక్షి వంతెన సమీపంలో జరిగిన ఈ ప్రమాదంలో ముగ్గురు కార్మికులు మృతిచెందగా, శిథిలాల కింద మరో పలువురు చిక్కుకున్నట్లు అధికారులు భావిస్తున్నారు. కొంతమంది కార్మికులను సహాయక బృందాలు సురక్షితంగా బయటకు తీసి సమీప ఆసుపత్రులకు తరలించాయి. మిగిలిన వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్‌డీఆర్‌ఎఫ్), అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, రెవెన్యూ శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అయితే ఎడతెరిపి లేని వర్షాలు, బురద, కొండ ప్రాంతంలోని ప్రతికూల పరిస్థితులు సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం కలిగిస్తున్నాయి. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు భారీ యంత్రాలు, ప్రత్యేక పరికరాలను వినియోగిస్తున్నారు.

### మృతులంతా వలస కార్మికులే

కేరళలోని వయనాడ్ జిల్లాలో టన్నెల్ రహదారి నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతంలో కొండచరియలు విరిగిపడిన ఘటనలో మృతి చెందిన ముగ్గురిని వలస కార్మికులుగా గుర్తించినట్లు అధికారులు తెలిపారు. మృతుల్లో మధ్యప్రదేశ్‌కు చెందిన యంత్రాల ఆపరేటర్ చంద్రబాన్, బిహార్‌కు చెందిన సివిల్ ఫోర్‌మన్ వికాస్ కుమార్, జార్ఖండ్‌కు చెందిన కార్మికుడు అన్మోల్ ఉన్నట్లు వెల్లడించారు. శిథిలాల కింద చిక్కుకున్న మృతదేహాలను వెలికితీసి వైతిరి తాలూకా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించినట్లు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి కె. మురళీధరన్ తెలిపారు. ప్రక్రియను వేగవంతం చేసేందుకు బతేరి తాలూకా ఆస్పత్రి నుంచి పోలీసు సర్జన్‌ను ప్రత్యేకంగా తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. సహాయక చర్యల్లో ఆరోగ్యశాఖతో పాటు 108 అంబులెన్స్ సేవలను వినియోగించారు. ఈ ఘటనలో గాయపడిన తొమ్మిది మందిని మెప్పాడి విమ్స్ ఆస్పత్రికి తరలించగా, ఇద్దరు కోలుకుని డిశ్చార్జ్ అయ్యారు. మిగిలిన ఏడుగురు చికిత్స పొందుతున్నారు. వారిలో ఎర్నాకుళంకు చెందిన సైట్ ఇంజనీర్ ఒక్కరే స్థానిక మలయాళీ కాగా, ఆయనకు స్వల్ప గాయాలే అయ్యాయని అధికారులు తెలిపారు. మరో ఇద్దరు ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. వారిలో ఒకరికి తలకు, రెండు కాళ్లకు తీవ్ర గాయాలు కాగా, మరొకరికి రెండు కాళ్లు విరిగినట్లు వైద్యులు వెల్లడించారు.

### సహాయ శిబిరాలకు 142 మంది తరలింపు

ఘటన ప్రాంతానికి సమీపంలో నివసిస్తున్న 42 కుటుంబాలకు చెందిన మొత్తం 142 మందిని మెప్పాడి పాలిటెక్నిక్‌లో ఏర్పాటు చేసిన సహాయ శిబిరానికి తరలించారు. అక్కడ వైద్య బృందాలు, ఆరోగ్య సిబ్బందిని నియమించడంతో పాటు అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచారు. రాత్రి సమయంలో కూడా అత్యవసర వైద్య సేవలు కొనసాగుతాయని మంత్రి తెలిపారు. ఇదిలాఉంటే ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీశన్ అత్యవసర సమీక్ష నిర్వహించారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని వీలైనంత త్వరగా రక్షించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్ర మంత్రులు అనిల్‌కుమార్, సిద్దిఖీ ఘటనాస్థలానికి బయల్దేరి సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. ముఖ్యమంత్రి వీడీ సతీశన్ కూడా బుధవారం మధ్యాహ్నం ఘటన స్థలాన్ని సందర్శించనున్నట్లు ముఖ్యమంత్రి కార్యాలయ వర్గాలు వెల్లడించాయి.

### వయనాడ్ ఘటనపై రాహుల్ దిగ్భ్రాంతి

కేరళలోని వయనాడ్‌లో జరిగిన కొండచరియలు విరిగిపడిన ఘటన తీవ్ర విషాదకరమని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, చిక్కుకుపోయిన వారిని సురక్షితంగా బయటకు తీసుకురావడానికి కేరళ ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేయాలని కోరారు. రక్షణ, సహాయక చర్యలు కొనసాగుతున్నా యని, ఈ క్లిష్ట సమయంలో కాంగ్రెస్, యూడీఎఫ్ కార్యకర్తలు బాధితులకు అండగా నిలిచి సాధ్యమైనంత సహాయం అందించాలని రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా పిలుపునిచ్చారు. గతంలో ఎన్నో ప్రకృతి విపత్తులను ధైర్యంగా ఎదుర్కొన్న వయనాడ్ ప్రజలు ఈ కష్టకాలాన్ని కూడా అధిగమిస్తారని, ప్రతి బాధిత కుటుంబానికి తాము అండగా ఉంటామని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా బాధిత కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ప్రభుత్వం సహాయక చర్యలను వేగవంతంగా కొనసాగిస్తోందని, కాంగ్రెస్, యూడీ ఎఫ్ కార్యకర్తలు బాధితులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. వయనాడ్ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా మాట్లాడుతూ.. పోలీసులు, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, సివిల్ డిఫెన్స్ బృందాలు గల్లంతైన వారి కోసం ముమ్మరంగా గాలిస్తున్నాయని తెలిపారు. జిల్లా యంత్రాంగంతో సమన్వయం కొనసాగుతోందని, బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అలాగే సహాయక చర్యలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ప్రజలు అధికారుల సూచనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. వయనాడ్‌లో గతేడాది కూడా భారీ కొండచరియలు విరిగిపడి తీవ్ర విషాదం నెలకొన్న విషయం తెలిసిందే. ముండక్కై, చూర్‌మాలా ప్రాంతాల్లో సంభవించిన ఆ విపత్తులో 298 మంది ప్రాణాలు కోల్పోగా, వందలాది కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. తాజాగా మరోసారి అదే జిల్లాలో కొండచరియలు విరిగిపడటంతో స్థానికుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది.

# సీజేపీ 'ఎక్స్' ఖాతాను పునరుద్ధరించాలి

- అభిజిత్ దీప్కే దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ

**న్యూఢిల్లీ:** కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) అధికారిక ఎక్స్ ఖాతాపై విధించిన నిషేధాన్ని ఎత్తివేసి, వెంటనే పునరుద్ధరించాలని ఢిల్లీ హైకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. నీట్ పరీక్ష ముగిసిన నేపథ్యంలో ఆ ఖాతాపై నిషేధాన్ని కొనసాగించాల్సిన అవసరం లేదని న్యాయస్థానం స్పష్టం చేసింది. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. నీట్ ప్రశ్నపత్రం లీక్, రీ–టెస్ట్ వ్యవహారాల సమయంలో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో గందరగోళం నెలకొనే అవకాశం ఉండటంతోనే ఆ పార్టీ ఎక్స్ ఖాతాపై తాత్కాలికంగా నిషేధం విధించినట్లు ఆయన కోర్టుకు వివరించారు. అయితే, నీట్ పరీక్షల ప్రక్రియ పూర్తయినందున ఆ కారణం ఇక వర్తించదని అభిప్రాయపడిన హైకోర్టు, సీజేపీ ఎక్స్ ఖాతాను పునరుద్ధరించాలని ఆదేశాలు జారీ చేసింది. పిటిషనర్ అభిజిత్ దీప్కే తన వాదనలో, అనధికారిక రాజకీయ ప్రచారాన్ని ప్రారంభించిన వారం రోజుల్లోనే తమ ఎక్స్ ఖాతాను నిలిపివేశారని తెలిపారు. ఖాతా నిలిపివేసే సమయానికి దానికి సుమారు రెండు లక్షల మంది ఫాలోవర్లు ఉన్నారని పేర్కొన్నారు. ఖాతా నిలిపివేత అనంతరం పార్టీ కార్యకలాపాల కోసం ప్రత్యేక వెబ్‌సైట్‌ను ప్రారంభించినట్లు కూడా కోర్టు దృష్టికి తీసుకువచ్చారు.

# కాళేశ్వరం కమీషన్ల ప్రాజెక్టు

(మొదటిపేజీ తరువాయి)

పెరిగిందని, చివరకు కాగ్ లెక్కల ప్రకారం అది రూ.1.47 లక్షల కోట్ల స్థాయికి చేరిందని పేర్కొన్నారు. అయినప్పటికీ ప్రాజెక్టు ఆయకట్టు మాత్రం పెరగలేదని విమర్శించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మా ణంలో సాంకేతిక లోపాలు స్పష్టంగా కనిపించాయని ముఖ్య మంత్రి తెలిపారు. నిర్మాణం పూర్తయిన కొద్ది కాలంలోనే మేడిగ డ్డ బ్యారేజీ కుంగిపోవడం, కన్నెపల్లి పంప్‌హౌస్ వరదల్లో ముని గిపోవడం, పిల్లర్లు దెబ్బతినడం వంటి ఘటనలు ప్రాజెక్టు నాణ్య తను ప్రశ్నిస్తున్నాయని అన్నారు. బ్యారేజీల కింద తగిన ఆయక ట్టు లేకపోయినా పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేయడం వల్ల ఒత్తిడి పెరిగిందని, ఇసుక పొరలపై నిర్మాణం చేపట్టడం కూడా సమస్యలకు దారితీసిందని వివరించారు.

### ప్రాణహిత–చేవెళ్లనే అసలు ప్రణాళిక

ఉమ్మడి రాష్ట్రంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రతిపాదించిన డా. బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు లక్ష్యం తెలంగాణకు సాగు, తాగునీరు అందించడమేనని రేవంత్ గుర్తు చేశారు. మహారాష్ట్రలో ముంపు సమస్యల కారణంగా కొన్ని సవాళ్లు ఎదురైనా, ఉత్తర తెలంగాణ నుంచి దక్షిణ తెలంగాణ వరకు గోదావరి జలాలను తరలించే ఆలోచన కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని చెప్పారు. అయితే బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కమీషన్ల కోసమే ప్రాజెక్టు రూపకల్పన మార్చారని ఆరోపించారు. కేసీఆర్, కేటీఆర్‌లు ఇంజినీర్లు కాదని, వ్యవస్థను తమకు అనుకూలంగా మలిచిన వారేనని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రతిపక్షం అనేక అపోహలు సృష్టించిందని, వాటన్నింటికీ నిపుణుల కమిటీ నివేదికతో పాటు పూర్తి ఆధారాలను ప్రజల ముందుంచామని ముఖ్యమంత్రి తెలిపారు. వాస్తవాలను ప్రజలకు తెలియజేయడమే ఈ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సింగరేణికి తాడిచర్ల బొగ్గు గని

**న్యూఢిల్లీ:** తెలంగాణకు కీలకమైన తాడిచర్ల–2 బొగ్గు గనిని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్)కు కేటాయించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ అంగీకరించారని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ గని కేటాయింపుకు సంబంధించి తాను మంగళవారం అధికారికంగా సంతకం చేసినట్లు వెల్లడించారు. గతంలో పలువురు ముఖ్యమంత్రులు ఈ గనిని సింగరేణికి కేటాయించాలని కేంద్రాన్ని కోరినా ఫలితం లేకపోయిందని, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుందని చెప్పారు. తాడిచర్ల–2 బొగ్గు గనిలో సుమారు 182 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని, ఈ గని ద్వారా ఏటా 6 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయవచ్చని కిషన్‌రెడ్డి తెలిపారు. దాదాపు 40 నుంచి 50 సంవత్సరాల పాటు ఈ గని నుంచి ఉత్పత్తి కొనసాగుతుందని చెప్పారు. ఈ ప్రాజెక్టు ద్వారా సింగరేణికి మొత్తం రూ.64 వేల కోట్లకుపైగా ఆదాయం సమకూరే అవకాశముందని వెల్లడించారు.

### వేలం లేకుండానే కేటాయింపు

తాడిచర్ల–2 గనిని నేరుగా సింగరేణికి కేటాయించడం వల్ల వేలం ప్రీమియం చెల్లించాల్సిన అవసరం ఉండదని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. దీంతో సంస్థకు కనీసం రూ.2,550 కోట్ల మేర ఆదా అవుతుందని చెప్పారు. అలాగే రాయల్టీ, పన్నులు తదితర రూపాల్లో తెలంగాణ ప్రభుత్వానికి సుమారు రూ.16 వేల కోట్ల వరకు ఆదాయం లభించే అవకాశం ఉందన్నారు. ఒడిశాలోని నైని కోల్ బ్లాక్‌ను కూడా సింగరేణికి దక్కేలా కేంద్ర ప్రభుత్వం కృషి చేసిందని కిషన్‌రెడ్డి తెలిపారు. ఆ బ్లాక్‌లో సుమారు 340 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని, ఇవి 30 నుంచి 35 సంవత్సరాలపాటు సరిపోతాయని చెప్పారు. అక్కడ ఏటా 10 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసే అవకాశం లభించడంతో సింగరేణికి సుమారు రూ.75 వేల కోట్ల రెవెన్యూ వచ్చే అవకాశముందని వివరించారు.

### క్లియరెన్స్‌లకు వేగం

సింగరేణికి సంబంధించిన ప్రధాన మైనింగ్ ప్రాజెక్టుల పర్యావరణ, అటవీ అనుమతులను వేగవంతం చేయడంలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ చర్యలతో సంస్థ ఉత్పత్తి సామర్థ్యం మరింత పెరిగే అవకాశముందని చెప్పారు. ప్రస్తుతం సింగరేణి పరిధిలో 39 గనులు కార్యకలాపాలు నిర్వహిస్తున్నా యని, వీటిలో 21 అండర్‌గ్రౌండ్, 18 ఓపెన్‌కాస్ట్ గనులు ఉన్నాయని మంత్రి వివరించారు. తెలంగాణలోని ఆరు నుంచి ఎనిమిది జిల్లాల్లో విస్తరించిన సింగరేణి లక్షలాది కుటుంబాలకు జీవనాధారమని అన్నారు.

# ప్రజలకు మెరుగైన సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యం

**ప్రజానావ, హైదరాబాద్ :** రాష్ట్రంలో రెవెన్యూ పరిపాలనను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు ఆధునిక, గౌరవప్రదమైన సేవలు అందించాలనే లక్ష్యంతో దశలవారీగా తహసీల్దార్, ఆర్డీవో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణాన్ని ప్రభుత్వం వేగవంతం చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార / పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. భవనాల నిర్మాణాలపై మంగళవారం అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలివిడతలో అద్దె భవనాలు, శిథిలావస్థలో ఉన్న 107 తహసీల్దార్ కార్యాలయా లు, 10 ఆర్డీవో కార్యాలయా లకు 263 కోట్ల రూపాయిలతో అలాగే స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించి రూ.97 కోట్ల రూపాయిలతో 48 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, ఆదిలాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగ ర్ జిల్లాల్లో జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాలు, నిజామా బాద్, వరంగల్ జిల్లాల్లో డీఐజీ కార్యాలయాలను నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ఈ మొత్తం భవనాల కోసం రెండు విభాగాలకు సంబంధించి 360 కోట్ల రూపాయి లతో పరిపాలనా అనుమతులు జారీ చేసిన ట్లు తెలిపా రు. ఈ భవనాలన్నీ ఒ నమూనాలో, ఆధుని క సౌక ర్యాలతో నిర్మించి ప్రజలకు వేగవంతమైన, పారదర్శ కమైన సేవలు అందించేలా రూపొందిస్తామని చెప్పారు. వీటి నిర్మాణ బాధ్యతను తెలంగాణ హౌసింగ్ కార్పొరే షన్‌కు అప్పగించినట్లు తెలిపారు. ముఖ్యమం త్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమ ని మంత్రి పేర్కొన్నారు. ఐదు సంవత్సరాల నిర్వహణా బాధ్యతను డా ఆ సంస్థలే తీసుకున్నాయని ఇప్పటి నాలుగు ప్రాంతాల్లో ఇంటిగ్రేటెడ్ భవనాలకు శంకుస్థాపన చేయగా నిర్మాణపనులు కొనసాగుతున్నాయన్నారు.

# హైదరాబాద్‌కు తీరని దాహం: కవిత

- వర్షాకాలంలోనూ రోజుకు 10 వేల ట్యాంకర్లపై ఆధారపడటం దారుణం
- తాగునీటి సమస్య పరిష్కారంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం
- కమిషన్ల కోసమే ప్రాజెక్టుల రూపకల్పన అంటూ ఆరోపణ



**ప్రజానావ, హైదరాబాద్:** వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ హైదరాబాద్‌లో తాగునీటి సమస్యలు ఏమాత్రం తగ్గకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత విమర్శించారు. జూలై నెలలో కూడా నగరంలో రోజుకు దాదాపు 10 వేల నీటి ట్యాంకర్లు బుక్ చేసుకునే పరిస్థితి నెలకొనడం ఆందోళనకరమని పేర్కొన్నారు. మహానగర ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే విషయాన్ని ఇది స్పష్టంగా వెల్లడిస్తోందని అన్నారు. హైదరాబాద్‌లో నెలకొన్న తాగునీటి సమస్యపై కవిత సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందించారు. నగర దాహార్తిని తీర్చేందుకు గతంలో కొండపోచమ్మ సాగర్ నుంచి తాగునీటి సరఫరా కోసం రూపొందించిన ప్రణాళికను పక్కనపెట్టి, మల్లన్నసాగర్ నుంచి గోదావరి డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్టు ఫేజ్–2, ఫేజ్–3 పనులను చేపట్టడం వెనుక ప్రజా ప్రయోజనం కంటే భారీ కమిషన్లే ప్రధాన ఉద్దేశమని ఆరోపించారు. ఒక ప్రైవేటు సంస్థకు లాభం చేకూర్చేందుకు ప్రాజెక్టు రూపకల్పన జరిగిందని, అదే కారణంగా ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడాల్సి వస్తోందని విమర్శించారు.

### ముందస్తు ప్రణాళికలో వైఫల్యం

తాగునీటి కొరత తలెత్తకుండా ప్రభుత్వం కనీస ముందస్తు కార్యాచరణ కూడా రూపొందించలేదని కవిత మండిపడ్డారు. ఎల్‌నినో ప్రభావం ఉండొచ్చని నిపుణులు ముందుగానే హెచ్చరించినప్పటికీ, తగిన జాగ్రత్తలు తీసుకోలేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి హైదరాబాద్ ప్రజల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. అలాగే గోదావరి డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి, వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# రామాయణ కాలం నుంచి భారత్-ఇండోనేషియా బంధం

**న్యూఢిల్లీ:** రామాయణ కాలం నుంచి భారత్–ఇండోనేసియాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు ఉన్నాయని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ బంధాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లడానికి ఇరుదేశాలు కృషి చేస్తున్నాయన్నారు. అక్కడి పార్లమెంటులో మోదీ ప్రసంగిస్తూ.. ఇరుదేశాల మధ్య బలమైన సహకారం ఇండో–పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం, శ్రేయస్సుకు దోహదపడుతుందన్నారు. ఇండోనేసియా ఎన్నికల వ్యవస్థను ఆధునీకరించడంలో సహాయపడటానికి, ప్రత్యేకమైన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల అభివృద్ధికి భారత్ సాయం చేస్తుందన్నారు. పహల్గాం ఉగ్ర ఘటన సమయంలో భారత్‌కు అండగా ఉన్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. అయితే, భారత ప్రభుత్వ పథకాలను కాపీ కొట్టామని ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో అంతకుముందు చెప్పిన విషయాన్ని ప్రస్తావించిన మోదీ.. స్నేహితుల మధ్య 'కాపీరైట్‌లు' ఉండవని నవ్వుతూ వ్యాఖ్యానించారు. జకార్తాలో ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో అధ్యక్షుడు ప్రబోవో మంగళవారం ఉదయం మాట్లాడుతూ.. ప్రధాని మోదీపై ప్రశంసలు కురిపించారు. ఎన్నో ఏళ్లుగా మోదీని నిశితంగా గమనిస్తున్నానని.. ఆయన చేపట్టిన అనేక కార్యక్రమాలు, పథకాలను కాపీ కొట్టానని అన్నారు. రెండు దేశాల్లో జనాభా ఎక్కువ ఉండడం, ప్రకృతి విపత్తులు వంటి సమస్యల నేపథ్యంలో వాటిని అధిగమించడానికి భారత్ అనుసరించే పద్ధతులను తాము డా పాటిస్తామన్నారు. మోదీ చేపట్టే కార్యక్రమాలలో దేనిపైనా కాపీరైట్ లేకపోవడం సంతోషంగా ఉందంటూ చిరునవ్వులు చిందించారు. ప్రధాని మోదీ ఇండోనేసియాలో పర్యటిస్తున్న క్రమంలో ంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కీలక ప్రకటన చేశారు. ఆ దేశంలో ఐఐఎం బెంగళూరు క్యాంపస్ ఏర్పాటుకు ప్రధాని మోదీ ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు.

# ఫర్టిలైజర్ యాప్‌ను వినియోగించుకోండి

- సాగు అవసరాలకు అనుగుణంగా బుకింగ్ చేసుకోవాలి
- కలెక్టర్ గరిమ అగ్రవాల్
- తంగళ్లపల్లి మండలం జిల్లెలలోని పీఏసీఎస్, గ్రోమోర్ కేంద్రాల్లో జిల్లా కలెక్టర్ తనిఖీ



ప్రజానావ, సిరిసిల్ల : ఫర్టిలైజర్ యాప్ సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. తంగళ్లపల్లి మండలం జిల్లెలలోని గ్రోమోర్, నేరేళ్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మంగళవారం తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో ఎంత యూరియా ఉంది? ఎంత వచ్చింది? ఫర్టిలైజర్ యాప్ ద్వారా రైతులు బుకింగ్ చేసుకున్న వివరాలు మొబైల్, రిజిస్టర్ లో పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో యూరియా నిల్వలను తనిఖీ చేశారు. పీఏసీఎస్ లో రైతులు యూరియా తీసుకువెళ్లేందుకు రాగా, వారితో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. ఎక్కడి నుంచి వచ్చారు? ఎన్ని ఎకరాల భూమి ఉంది? ఏ ఏ పంటలు సాగు చేస్తున్నారు? ఫర్టిలైజర్ యాప్ వినియోగిస్తున్నారా? సేవలు ఎలా ఉన్నాయో వారిని అడిగి తెలుసుకున్నారు. క్యూలో నిలబడే ఇబ్బందులు దూరం అయ్యాయని, ఎప్పుడైనా తమకు నచ్చిన షాప్ లో తీసుకునే అవకాశం ఉందని రైతులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. రైతుల కోసం ప్రభుత్వం రూపొందించిన ఫర్టిలైజర్ యాప్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. రైతులు తమకు నచ్చిన, అందుబాటులో ఉన్న షాప్ నుంచి యూరియా కొనుగోలు చేయవచ్చని స్పష్టం చేశారు. జిల్లాలో ఎరువులకు కొరత లేదని తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులు వ్యవసాయ అధికారుల సూచనల మేరకు పంటలు సాగు చేయాలని సూచించారు. ఆయిల్ పామ్ ఇతర పంటల వైపు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు. ఈ పరిశీలనలో జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, వ్యవసాయ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

# సిరిసిల్లలో సీఐటీయూ జాతీయ సమావేశాలు

- విజయవంతం చేయాలని సన్నాహక సమావేశం
- అఖిల భారత, రాష్ట్రాల నాయకులు, దేశంలోని వివిధ రాష్ట్రాల ప్రతినిధుల రాక
- సీఐటీయూ - తెలంగాణ పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేష్ పిలుపు



ప్రజానావ, సిరిసిల్ల : 2026 ఆగస్టు 23 న సిఐటియు ఆల్ ఇండియా టెక్స్టైల్ అండ్ పవర్ లూమ్ వర్కర్స్ వర్కింగ్ కమిటీ సమావేశాలను తెలంగాణ రాష్ట్రంలోనే టెక్స్టైల్ – పవర్లూమ్ వస్త్ర పరిశ్రమ కేంద్రంగా ఉన్న సిరిసిల్లలో మొదటిసారి నిర్వహించ డం జరుగుతుందని సిఐటియు తెలంగాణ పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మూషం రమేష్ , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేష్ వెల్లడించారు. మంగళవారం బివై నగర్ లోని అమృతలాల్ శుక్ల కార్మిక భవన్ సిఐటియు జిల్లా కార్యాలయంలో ఆగస్టు 23 న సిరిసిల్లలో జరగనున్న సిఐటియు ఆల్ ఇండియా టెక్స్ టైల్ అండ్ పవర్లూమ్ వర్కర్స్ వర్కింగ్ కమిటీ సమావేశాల విజయంతనం కోసం సిఐటియు జిల్లా ఆఫీస్ బేరర్స్ అలాగే పవర్లూమ్ అనుబంధ యూనియన్ల ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశం సిఐటియు జిల్లా కార్యదర్శి కోడం రమణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు తెలంగాణ పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మూషం రమేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేష్ లు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ ఈ సమావేశాలకు సిఐటియు అఖిల భారత, రాష్ట్ర నాయకులతో పాటుగా దేశంలోని అన్ని రాష్ట్రాల నుండి ప్రతినిధులు హాజరవుతున్నారని, ఈ సమావేశాల సందర్భంగా సిరిసిల్లలో వేలాది మంది కార్మికులతో భారీ ర్యాలీ – బహిరంగ సభ నిర్వహిం చడం జరుగుతుందన్నారు. ఈ సమావేశాలలో దేశవ్యాప్తంగా ఉన్న టెక్స్టైల్ మరియు పవర్లూమ్ పరిశ్రమలు, కార్మికుల సంక్షేమానికి సంబంధించిన ప్రస్తుత పరిస్థితులు, ప్రభుత్వ విధానాలపై చర్చించి భవిష్యత్తు ఉద్యమ పోరాట కార్యాచరణను రూపొం దించడం జరుగుతుందన్నారు. సిఐటియు ఆల్ ఇండి యా టెక్స్ టైల్ అండ్ పవర్లూమ్ వర్కింగ్ కమిటీ సమావేశాలు మొదటి సారిగా తెలంగాణ రాష్ట్రంలోని సిరిసిల్లలో జరుగుతున్నందున ఈ సమావేశాలు విజయవంతం కావడానికి అన్ని రంగాల కార్మికులు, ఆసాములు, యజమానులు, వాణిజ్య వ్యాపారస్తులు, ప్రజా ప్రతినిధులు ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయ సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ఆఫీస్ బేరర్స్ అన్నల్దాస్ గణేష్, ఎలిగేటి రాజశేఖర్, సూరం పద్మ, గీస బిక్షపతి, శ్రీరాముల రమేష్ చంద్ర, పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు సిరిమల్ల సత్యం, కూచన శంకర్, బెజ్గం సురేష్, సబ్బని చంద్రకాంత్, బాస శ్రీధర్, గడ్డం రాజశేఖర్, స్వర్గం చంద్రశేఖర్, సందుపట్ల పోచమ్మలు పాల్గొన్నారు.

# 10న విద్యా సంస్థల బంద్ జయప్రదం చేయాలి

- ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కుర్ర రాకేష్
- సమావేశంలో బంద్ పోస్టర్ల ఆవిష్కరణ

ప్రజానావ, సిరిసిల్ల : జూలై 10న ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు కుర్ర రాకేష్ పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా నేతాజీ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో బంద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఐఎస్ఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు కుర్ర రాకేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు రోజు రోజుకూ తీవ్రమవుతున్నాయని, వాటి పరిష్కారం కోసం విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున జూలై 10న జరిగే బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యను పూర్తిగా వ్యాపారంగా మార్చి విద్యార్థులు, తల్లిదండ్రులపై అధిక ఆర్థిక భారం మోపుతున్నారని విమర్శించారు. ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసే విధానాలను వ్యతిరేకిస్తూ ఈ బంద్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్ర ంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా గర్ల్స్ కన్వీనర్ బర్రెంకల శ్రీహరిక, బోదాస్ ప్రవళిక, నాయకులు ప్రవర్ష, సంధ్య, అనిల్, భాను, వంశీ, లిఖిత, వైభయ్ లు పాల్గొన్నారు.

# కడియంపై క్రమశిక్షణ చర్య తీసుకోవాల్సిందే

- మంత్రిగా తన శాఖలో జోక్యం చేసుకోవడం ఏమిటి?
- సీఎం రేవంత్‌కు లేఖ రాసిన మంత్రి కొండా సురేఖ

ప్రజానావ, హైదరాబాద్ : స్టేషన్ ఘన్‌పూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తీరుపై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. దేవాదాయ శాఖ మంత్రిగా ఉన్న నన్ను, నా కార్యాలయాన్ని పూర్తిగా విస్మరించి, ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా కడియం శ్రీహరి కమిషనర్ ఆఫీస్‌లో అధికారిక సమీక్షా సమావేశం నిర్వహించారని ఆమె ఫిర్యాదు చేశారు. మాస్టర్ ప్లాన్లు, శాఖాపరమైన నివేదికలపై ఆదేశాలు జారీ చేయడం మంత్రి పరిధిలోని అంశమని, అలాంటప్పుడు ఒక ఎమ్మెల్యే దేవాదాయ శాఖ అధికారులను పిలిచి ఎలా ఆదేశిస్తారని సురేఖ ప్రశ్నించారు. కడియం శ్రీహరి చర్య ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థలో అనుచిత సంప్రదాయానికి నాంది అని, ఇది వలం పరిపాలనా లోపం మాత్రమే కాదని, ఒక శాఖా మంత్రి అధికారాలను బహిరంగంగా ప్రశ్నించే కుట్ర అని ఆమె లేఖలో మండిపడ్డారు. గతంలోనూ ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలను రెచ్చగొట్టి తనపై కడియం శ్రీహరి దుష్ప్రచారం చేశారని కొండా సురేఖ ఆరోపించారు. ఇప్పుడు డా ఉద్దేశపూర్వకంగానే తన్ను నిర్లక్ష్యం చేస్తూ ఆయన తీసుకుంటున్న ఇలాంటి చర్యల వల్ల దేవాదాయ శాఖ అధికార యంత్రాంగంలో తీవ్ర అయోమయం నెలకొందని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ప్రజాప్రతినిధిగా ఉంటూ ప్రభుత్వ నిబంధనలను, మంత్రి అధికారాలను అతిక్ర మించిన కడియం శ్రీహరిపై పార్టీ క్రమశిక్షణా కమిటీ ద్వారా విచారణ జరిపించాలని, భవిష్యత్తు లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఆయనపై తగిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కొండా సురేఖ తన లేఖలో కోరారు. మంత్రిగా తనకు సమాచారం ఇవ్వకుండా కడియం దేవాదాయ శాఖపరమైన సమీక్ష నిర్వహించారని, ఆయన సమీక్షించడం పరిపాలనా వ్యవస్థకు విరుద్ధమని పేర్కొన్నారు. శాఖ మంత్రిగా అన్ని అధికారాలు తన ఉంటాయాన్న సురేఖ.. కడియం వ్యవహారంపై పార్టీ, ప్రభుత్వ స్థాయిలో విచారణ చేపట్టాలని కోరారు. బొగ్గులకుం టలోని దేవాదాయశాఖ కమిషనర్ కార్యాలయంలో సోమవారం కడియం శ్రీహరి సమీక్ష నిర్వహిం చారు. దేవాలయాలకు సమస్య ఉంటే మంత్రి, అధికారులకు వినతిపత్రం ఇవ్వాలి కానీ, సమీక్ష నిర్వహించడం ఏంటని ప్రశ్నించారు. ఈ అంశంపై కడియం శ్రీహరి నుంచి వివరణ కోరాలని సీఎం రేవంత్‌రెడ్డికి సురేఖ విజ్ఞప్తి చేశారు.

# సింగరేణిలో రక్షణ, ఉత్పత్తి పరికరాల కొరతను నివారించాలి

- రూ.56 వేల కోట్ల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలి
- కార్మికుల భద్రతతో రాజీ పడొద్దంటూ ఏఐటీయూసీ డిమాండ్



ప్రజానావ, రామగుండం: రాష్ట్ర ప్రభుత్వం నుంచి సింగరేణి సంస్థకు రావాల్సిన రూ.56 వేల కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, గనుల్లో నెలకొన్న రక్షణ, ఉత్పత్తి పరికరాల కొరతను వెంటనే నివారించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియ న్ (ఏఐటీయూసీ) డిమాండ్ చేసింది. యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే ప్రభుత్వ బకాయిలు వసూలు కాకపోవడంతో పాటు కార్మికులకు అవసరమైన రక్షణ పరికరాలు, ఉత్పత్తి సామగ్రి తీవ్ర కొరత ఏర్పడిందని ఆరోపించింది. ఏడాది కాలంగా ఉత్పత్తి, భద్రతకు సంబంధించిన కీలక పరికరాలు అందుబా టులో లేకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంటూ మంగళవారం ఆర్జీ–1 ఏరియాలోని గనులు, ఓసీపీ–5తో పాటు వివిధ విభాగాల అధికారులకు ఏఐటీయూసీ ఆర్జీ–1 బ్రాంచ్ ఆధ్వర్యంలో వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మద్ది ఎల్లాగౌడ్, బ్రాంచ్ కార్యదర్శి రంగు శ్రీను మాట్లాడుతూ డ్రిల్ రాడ్లు, డ్రిల్ బిట్లు, చెమ్మసులు, డాగ్ నైల్స్, గిరిమిట్లు, టెక్నీషియన్ల పనిముట్లు, ట్యూబ్‌లైట్లు వంటి ఉత్పత్తి సామగ్రితో పాటు బూట్లు, సాక్స్, గ్లౌజులు, హెల్మెట్లు, క్యాప్ లాంపులు, జీఐ క్యానిస్టర్లు, బెల్ట్ క్యానిస్టర్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు, షాట్ ఫైరర్ కేబుళ్ల వంటి అత్యవసర భద్రతా పరికరాలు కూడా సరిపడా అందుబాటులో లేవని తెలిపారు. విడిభాగాలు, పనిముట్లు లేకపోవడంతో ఉత్పత్తి లక్ష్యాలను సాధించడం కష్టమవుతోందని, పాతబడిన యంత్రాలతో పనిచేయడం వల్ల ఆపరేటర్లు నడుము నొప్పితో పాటు ఇతర ఆరోగ్య సమస్యలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సేఫ్టీ కమిటీ, మైన్స్ కమిటీ, సేఫ్టీ ట్రైపార్టైట్ సమావేశాల్లో ఈ సమస్యలను పలుమార్లు ప్రస్తావించినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింగరేణి అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తూ సంస్థను నిర్వీర్యం చేసే విధంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే కార్మికులతో కలిసి ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. యాజమాన్యం తక్షణమే స్పందించి ఉత్పత్తి, భద్రతా పరికరాలను సమకూర్చ డంతో పాటు కొత్త యంత్రాలను అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో ఏఐటీయూసీ ఆర్జీ–1 బ్రాంచ్ ఆఫీస్ బేరర్లు మాదన మహేష్, సంకె అశోక్, బోగ సతీష్‌బాబు, గండి ప్రసాద్, సిద్ధమల్ల రాజు, ఎం. చక్రపాణి, దొంత సాయన్న, చెప్యాల భాస్కర్, పిట్ కార్యదర్శులు మానాల శ్రీనివాస్, పొన్నాల వెంకటయ్య, కారంపూరి వెంకన్న, గుర్రం ప్రభుదాస్, నాయిని శంకర్, బలుసు రవి, బండి మల్లేష్, గౌడిశెల నరేశ్, చంద తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# స్త్రీనిధి రుణాల పంపిణీ, రికవరీపై ప్రత్యేక దృష్టి సారించాలి

- కలెక్టర్ గరిమ అగ్రవాల్
- మన స్త్రీనిధి యాప్ వినియోగాన్ని విస్తృతం చేయాలి
- గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు, మండల ఏపీఎంలతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్



ప్రజానావ, సిరిసిల్ల : స్త్రీనిధి రుణాల పంపిణీ, రికవరీ, మన స్త్రీనిధి యాప్ వినియోగం రుణాల దుర్వినియోగం, మోసాలపై కఠిన చర్యలు తీసుకోవడంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. స్త్రీనిధి ద్వారా మహిళా స్వయం సహాయక సంఘాలకు అందిస్తున్న రుణాల పంపిణీ, రికవరీ, రుణాల దుర్వినియోగంపై తీసుకోవాల్సిన చర్యలు, తదితర అంశాలపై గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు, మండల ఏపీఎంలతో మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జిల్లా కలెక్టర్ సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా స్వయం సహాయక సంఘాల ఆర్థిక సాధికారతకు స్త్రీనిధి తోడ్పడుతుందని, సంఘాలకు అవసరమైన రుణాలు సకాలంలో అందేలా చూడడంతో పాటు, మండలాల వారీగా పనితీరు నిరంతరం సమీక్షిస్తూ లక్ష్యాల సాధనకు ప్రత్యేక కార్యాచరణ రూపొం దించాలని, మహిళల ఆర్థికాభివృద్ధికి స్త్రీనిధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. జిల్లాకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.113 కోట్ల వార్షిక రుణ లక్ష్యం కేటాయించబడిందని, లక్ష్య సాధనలో వెనుకబడిన మండలాలపై ప్రత్యేక దృష్టి సారించి, అర్హత కలిగిన స్వయం సహాయక సంఘాలను గుర్తించి వేగంగా రుణాలు మంజూరు చేయాలని సూచించారు. గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లాలో రికవరీ శాతాన్ని పెంచడంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. జీరో రికవరీ ఉన్న స్వయం సహాయక సంఘాలను గుర్తించి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. సంబంధిత మండల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సంఘాలతో సమావేశాలు నిర్వహించి, బకాయిల వసూళ్లపై అవగాహన కల్పించాలని సూచించారు. ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి లక్ష్మీ నారాయణ, జిల్లా పశు సంవర్ధక శాఖ రవీందర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా సహకార శాఖ అధికారి రామకృష్ణ, మత్స్య శాఖ అధికారి సౌజన్య, పంచాయితీ అధికారి జయశీల, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్, డీపీఎంలు, ఏపీఎంలు, తదితరులు పాల్గొన్నారు.

# రక్షణను విస్మరించి సాధించే ఉత్పత్తి వ్యర్థమే

- గనుల్లో ఎస్‌వోపీ, సీవోపీ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి
- ప్రమాదరహిత ఉత్పత్తే లక్ష్యంగా పనిచేయాలి
- అధికారులకు జీఎం మునిగంటి శ్రీనివాస్ సూచన

ప్రజానావ, నస్పూర్: గనుల్లో రక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, భద్రతా ప్రమాణాలను విస్మరించి సాధించే ఉత్పత్తి ఎలాంటి ప్రయోజనం కలిగించదని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ స్పష్టం చేశారు. వరుస ప్రమాదాల నేపథ్యంలో శ్రీరాంపూర్ ఏరియా పరిధిలోని ఎస్ఆర్పీ–3 గనిలో మంగళవారం నిర్వహించిన సేఫ్టీ అవేర్‌నెస్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అధికారులు, సూపర్వైజర్లు, ఉద్యోగులకు రక్షణపై అవగాహన కల్పించారు. గనిలో ఇటీవల చోటుచేసుకున్న ప్రమాదాలను సమీక్షిస్తూ వాటి కారణాలను విశ్లేషించారు. ఉత్పత్తి, ఉత్పాదకతలో వెనుకబడిన ఈ గని గత నెలలో 100 శాతం ఉత్పత్తితో పాటు మెరుగైన ఓఎంఎస్ సాధించడం అభినందనీయమని పేర్కొన్న ఆయన, అదే సమయంలో గత నెల రోజులుగా చోటుచేసుకున్న ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. ఇకపై అందరూ సమన్వయంతో పనిచేసి ఈ గనిని ప్రమాదరహిత గనిగా తీర్చిదిద్దాలని, ప్రతి ఉద్యోగి రక్షణ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఫేస్‌లో పనులు ప్రారంభించే ముందు సర్దార్, కోల్ కట్టర్‌తో కలిసి రూఫ్ టెస్ట్ నిర్వహించి, బోల్టింగ్, సపోర్టింగ్ పనులు పూర్తయిన తర్వాతే పనులకు అనుమతించాలని ఆదేశించారు. మనసులో సురక్షితంగా ఉండాలనుకోవడం మాత్రమే సరిపోదు.. ఎస్‌వోపీలు, సీవోపీలను కచ్చితంగా అమలు చేస్తూ పనిచేస్తేనే నిజమైన రక్షణ సాధ్యమవుతుంది. రక్షణను విస్మరించి సాధించే ఉత్పత్తి వ్యర్థమే అని ఆయన స్పష్టం చేశారు. గనుల్లో నిరంతరం రక్షణ తనిఖీలు నిర్వహించడంతో పాటు అవసరమైన మెటీరియల్స్ ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఒకరిపై మరొకరు తప్పులు మోపుకోవడం కాకుండా అందరూ సమిష్టిగా పనిచేసి రక్షణతో కూడిన ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ ఏజెంట్ రవికుమార్, గని మేనేజర్ వెంకట్‌రావు, రక్షణ అధికారి మహేందర్, సంక్షేమ అధికారి వెంకన్న, సహాయ పిట్ కార్యదర్శి అంబాల రవి, అధికారులు, సూపర్వైజర్లు, మైనింగ్ సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.



# దివ్యాంగులకు ప్రభుత్వం అండ

**కలెక్టర్ ఆదర్శ్ సురభి**

ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో: దివ్యాంగులు సమాజంలో ఆత్మవిశ్వాసంతో జీవించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. శనివారం ఐడీఓసీ కార్యాలయ ఆవరణలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు సహాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ భీమ్యా నాయక్‌తో కలిసి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అర్హులైన దివ్యాంగులకు కలెక్టర్ చేతుల మీదుగా మూడు చక్రాల సైకిళ్లను పంపిణీ చేశారు.



# గురుకులాల్లో పరిశుభ్రతకు పెద్దపీట

- మెనూ ప్రకారం ఆహారం సరఫరా
- అధికారులతో సమీక్షలో మంత్రి పొన్నం

హైదరాబాద్ : గురుకులాలు, హాస్టళ్లలో క్లీన్ అండ్ గ్రీన్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని ఉన్నతాధికారులకు రోడ్డు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదే శించారు. మంగళవారం ఆయా శాఖల ఉన్నతాధికా రులతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ మెనూ తప్పనిసరిగా అమలు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. విద్యార్థుల సంక్షేమంపై డీబీసీవోలు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. బీసీ స్టడీ సర్కిల్స్ బలోపేతానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇతర రాష్ట్రాల స్టడీ సర్కిల్స్ విధానాలపై అధ్యయనం చేయాలని ఆదేశించారు. జూలై 16 నుంచి కులవృత్తుల మేళా.. అన్ని కులాలకు సమాన అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్‌తో బీసీలకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించాలని అన్నారు. ఎకనామిక్ సపోర్ట్ స్కీమ్స్‌పై సమగ్ర అధ్యయనం చేయాలని అధికారులను కోరారు. ఐటీ, ఐఐఎం విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీపై ఈ సందర్భంగా అధికారుల నుంచి మంత్రి నివేదిక కోరారు. గురుకులాలు, హాస్టళ్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని అధికారులను మంత్రి పొన్నం ఆదేశించారు. కుట్టు మిషన్ పథకం అమలుకు సమగ్ర మార్గదర్శకాలు రూపొందించాలని సూచించారు. కాటమయ్య రక్షణ కవచాల కిట్ల పంపిణీ వెంటనే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

# 2034 నాటికి కోటి మందిని కోటీశ్వరులను చేస్తాం

ప్రజానావ, హైదరాబాద్: 2034 నాటికి రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రజాపాలన ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని సీఎం గుర్తు చేశారు. ఈ పథకం వల్ల ఉద్యోగినులు, మహిళలకు ప్రతి నెలా గణనీయమైన ఆర్థిక ఆదా జరుగుతోందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లను మహిళల పేర్లపైనే మంజూరు చేస్తున్నామని, త్వరలో హైదరాబాద్ నగరంలో లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టి పేదలకు అందజేస్తామని చెప్పారు. నాచారంలో రూ.40 కోట్ల వ్యయంతో నిర్మించిన బాలామృతం తయారీ ప్లాంట్‌ను మంగళవారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. తెలంగాణ అభివృద్ధిలో మహిళలు, చిన్నారుల సంక్షేమమే కీలకమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. మహిళల ఆర్థిక సాధికారత, పిల్లల ఆరోగ్యవంతమైన భవిష్యత్తు కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందన్నారు. గర్భిణి మహిళల నుంచి ఆరేళ్ల వయస్సు వచ్చే వరకు చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించే లక్ష్యంతో బాలామృతం పంపిణీ చేపడుతున్నామని సీఎం తెలిపారు. ఈ ప్లాంట్‌లో తయారయ్యే బాలామృతాన్ని తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలకు కూడా సరఫరా చేసే స్థాయికి అభివృద్ధి చేస్తామని చెప్పారు. ప్లాంట్‌లో గంటకు 18 టన్నుల బాలామృతం తయారయ్యే సామర్థ్యం ఉందని వెల్లడించారు.

## పిల్లల పోషకాహారానికి ప్రాధాన్యం

పిల్లలకు ఓటు హక్కు లేకపోయినా వారి భవిష్యత్తు పట్ల ప్రభుత్వానికి పూర్తి బాధ్యత ఉందని సీఎం స్పష్టం చేశారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అల్పాహారంతో పాటు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని తెలిపారు. భోజనాల నాణ్యతను పర్యవేక్షించేందుకు ఉపాధ్యాయులు కూడా విద్యార్థులతో కలిసి అదే ఆహారం తీసుకోవాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఏటా రూ.27 వేల కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. ఇక రాజకీయాలకు అతీతంగా ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉంటానని సీఎం స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# 10న రైతు ఆశీర్వాద సభ

- రద్దయిన చోటనే తిరిగి నిర్వహణ
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి తుమ్మల

ప్రజానావ, ఖమ్మం : గత నెలలో రద్దయిన రైతు ఆశీర్వాద సభను తిరిగి ఈ నెల 10న నిర్వహించాలని ప్రబుత్వం నిర్ణయించింది. తెలంగాణలో రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం మరో భారీ బహిరంగ సభకు సిద్ధమైంది. 10వ తేదీన ఖమ్మం జిల్లా జగన్నాథపురంలో ప్రతిష్టాత్మక 'రైతు ఆశీర్వాద సభ' నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం కానున్న ఈ భారీ సభలో సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సభాస్థలాన్ని స్వయంగా పరిశీలించారు.. సభకు సంబంధించిన ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా నిధులను రికార్డ్ స్థాయిలో అందజేసిందని కీలక వ్యాఖ్యలు చేశారు. వలం ఏడు రోజుల్లోనే ఏకంగా 7,491 కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేశామని ఆయన స్పష్టం చేశారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందనడానికి ఇదే నిదర్శనమని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ఎల్‌నినో పరిస్థితులు తీవ్రమవుతున్న నేపథ్యంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు వేగవంతం చేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు జిల్లాల వారీగా రూపొందించిన ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికలను పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు సిద్ధం కావాలన్నారు. ఎల్‌నినోపై అగ్రివర్సిటీ చేసిన సూచనలు రైతులకు సకాలంలో చేరేలా చర్యలు తీసుకోవాలి. ఇప్పటి 'తెలంగాణ వాతావరణ సలహా కార్యక్రమం'తో రైతులకు వాట్సప్ ద్వారా కచ్చితమైన, సమయానుకూలమైన వాతావరణ సమాచారాన్ని అమలు చేస్తున్నాం. పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ ప్రణాళికలను వెంటనే అమలు చేయాలని తుమ్మల సూచించారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
విలేకరులు కావలెను
రెండు తెలుగు రాష్ట్రాల్లో వేగంగా విస్తరిస్తున్న తెలుగు దినపత్రిక ప్రజానావలో పని చేయుటకు మా సంస్థ ఆహ్వానం పలుకుతోంది
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాల్లో పనిచేయుటకు విలేకరులు కావలెను.
మండలాలు, అర్బన్, పట్టణ కేంద్రాల్లో పనిచేసే వారికి కనీస అర్హత ఇంటర్మీడియట్
స్టాఫ్ రిపోర్టర్, ఆర్‌సీ ఇన్‌చార్జీలకు కనీస అర్హత డిగ్రీ ఉండాలి
మీ బయోడేటాను ఇప్పుడే ఈ నెంబర్లకు వాట్సాప్ చేయండి
9948433277, 9014966169

EDITORIAL



# జనాభా పెరిగితే తట్టుకోగలమా?

కేవలం మైనార్టీ ఓట్లను గంపగుత్తగా లాగేసేం దుకు అధిక జనాభా కావాలి, పిల్లను కనండి, డబ్బులు ఇస్తాను అంటున్నారు. ముగ్గురు అంతకన్నా ఎక్కువ ఉన్నవారికి తక్షణం 5వేల సాయం ప్రకటించారు. మరి లోకేశ్ ఒక్క పిల్లాడితోనే ఎందుకు సరిపుచ్చాడు. ఆయనకు ఈ నియమం వర్తించదా? చంద్రబాబు ఇంట్లోనే ఈ పద్ధతి లేనప్పుడు రాష్ట్రానికి ఎందుకు అంటగట్టాలన్నది ప్రజలు ఆలోచన చేయాలి. ఇందులో ఏదో మతలబు లేకుండా చంద్రబాబు ప్రకటించరని గుర్తించాలి. ఇకపోతే ఎపిలో అనేక సమస్యలు ఉన్నాయి. ముఖ్యంగా శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయి. సాయికృష్ణ అనే వ్యక్తిని పోలీసులు తీసుకుని వెళ్లి మాయం చేస్తే అతీగతీ లేదు. ఓ చిన్నారి తప్పిపోతే దిక్కులేదు.

ఎన్నికల ముందు నేతలు ఇచ్చే హామీలన్నీ ఓట్ల కోసం అని ప్రజలు గుర్తించనంత వరకు ప్రజాస్వామ్యం అపహాస్యం అవుతూనే ఉంటుంది. అధికారంలోకి వచ్చాక సొంత ఎజెండాతో సాగుతారు. ఓట్ల కోసం తప్ప ప్రజలపై లేదా రాష్ట్రం, దేశంపై ప్రేమతో ఏ రాజకీయ నాయకుడు పనిచేయరని గుర్తించాలి. ఎపిలో చంద్రబాబు జనాభా విషయంలో చేస్తున్న విన్యాసం ఇదే. కేవలం మైనార్టీ ఓట్లను గంపగుత్తగా లాగేసేం దుకు అధిక జనాభా కావాలి, పిల్లను కనండి, డబ్బులు ఇస్తాను అంటున్నారు. ముగ్గురు అంతకన్నా ఎక్కువ ఉన్నవారికి తక్షణం 5వేల సాయం ప్రకటించారు. మరి లోశ్ ఒక్క పిల్లాడితోనే ఎందుకు సరిపు చ్చాడు. ఆయనకు ఈ నియమం వర్తించదా? చంద్రబాబు ఇంట్లోనే ఈ పద్ధతి లేనప్పుడు రాష్ట్రానికి ఎందుకు అంటగట్టాలన్నది ప్రజలు ఆలోచన చేయాలి. ఇందులో ఏదో మతలబు లేకుండా చంద్రబాబు ప్రకటించరని గుర్తించాలి. ఇకపోతే ఎపిలో అనేక సమస్యలు ఉన్నాయి. ముఖ్యంగా శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయి. సాయికృష్ణ అనే వ్యక్తిని పోలీసులు తీసుకుని వెళ్లి మాయం చేస్తే అతీగతీ లేదు. ఓ చిన్నారి తప్పిపోతే దిక్కులేదు. రేప్‌లు జరుగుంతుంటే అడిగేవారు లేరు. వలం అమరా వతి ఒక్కటే ఇప్పుడు లక్ష్యంగా బాబు పాలన సాగిస్తున్నాడు. ఇప్పటి 33 వేల ఎకరాలు సేకరించినా ఇంకా భూమి కావాలంటూ రైతులను వేధిస్తున్నారు. భూములు ఇచ్చిన వారికి సక్రమంగా ప్లాట్లు ఇచ్చి వారిని సంతోషంగా ఉంచడం లేదు. వలం రియల్ వ్యాపారం లక్ష్యంగా బాబు పాలన సాగుతోందని వైసిపి ఆరోపణలు చేస్తోంది. ప్రశ్నించిన వారిని వేధింపులకు గురిచేస్తున్నారని జగన్ విమర్శలు చేస్తున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను మరచిన పాలకు లు అధికారంలోకి రాగానే తమ సొంత ఎజెండా అమలు చేస్తుంటా రు. ఇలా ఎన్నికల సమయంలో ప్రజల ముందు ఎన్నో హామీలు ఇస్తారు. ఉద్యోగాలు, అభివృద్ధి, సంక్షేమం, మౌలిక సదుపాయాలు, అవినీతి నిర్మూలన వంటి అంశాలపై గొప్ప గొప్ప ప్రకటనలు చేస్తారు. కానీ ఎన్నికలు ముగిసిన తర్వాత వాటిలో చాలా హామీలు మరుగున పడిపోతాయి. అవినీతి అన్నది వలం ఉద్యోగుల పరిమితం అయ్యింది. వారు లంచం తీసుకుంటే పట్టేస్తున్నారు. అలా పట్టుకుం టున్న వారి సంఖ్య ఒక్కశాతం డా ఉండదేమో. లంచం లేనిదే పని జరగడం లేదు. లంచాల కోసమే ఉద్యోగాలు ఇచ్చారేమో అనుకో వాలి. ఇకపోతే ఇప్పటి దేశం అధిక జనాభాతో సతమతం అవుతోం ది. ఉన్న జనాభాకు సరిపడా తిండిపెట్టలేక పోతున్నాం. కనీస వసతులు కల్పించలేకపోతున్నాం. విద్య,వైద్యం అందించలేకపోతు న్నాం. దేశం అభివృద్ధి చెందాలంటే కనీస వసతులు కలగాలి. పాలకులు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. ప్రజలు డా తమ హక్కులతో పాటు బాధ్యతలను విస్మరించడదు. ఒకవైపు జవాబుదారీ పాలన, మరోవైపు బాధ్యతగల పౌరసమాజం ఉంటేనే నిజమైన ప్రగతి సాధ్యమవుతుంది. మనం ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తే, పాలిస్తే నష్టపోయేది రాష్ట్రమే. నష్టం జరిగేది ప్రజల తప్ప పాలకులకు కాదు. భారతదేశం ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశంగా ఎదిగింది. 145 కోట్ల జనాభాతో సతమతమవుతోంది. యువశక్తి, సహజ వనరులు, మేథో సంపత్తి, సాంతిక నైపుణ్యం వంటి అనేక బలాలు మనకు ఉన్నా, అడుక్కు తిన్నట్లుగా ప్రజల జీవితాలు సాగుతున్నాయి. విద్య, ఆరోగ్యం, పారిశుద్ధం, పర్యావరణం వంటి విషయాల్లో వెనకబడి ఉన్నాం. అవినీతి ఊడలు దిగుతోంది. దీనికి కారణం వలం పాలకుల వైఫల్యమే కాదు, ప్రజల నిర్లక్ష్యం డా ఓ కారణంగా చూడాలి. మనకెందుకులే అనుకుంటే ఇలాగే సాగదీస్తారు. దేశాభివృద్ధి అంటే వలం ప్రభుత్వ పథకాలు, భారీ ప్రాజెక్టులు మాత్రమే కాదు. ప్రతి పౌరుడి బాధ్యతా యుతమైన పాత్ర పోషించాలి. ప్రజాస్వామ్య దేశంలో పౌరస్పృహ లేకపోతే పాలకులు మనలను ఏమారుస్తారని గుర్తించాలి. ప్రజల సమస్యల కంటే రాజకీయ ప్రయోజనాలు, అధికారం నిలబెట్టుకోవడమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న తీరును చూస్తున్నాం. అన్ని రాష్ట్రాల్లోనూ ఇదే తరహా పాలన సాగుతోంది. ఆదాయాలను మించి ఖర్చు చేస్తున్నారు. రాజకీయ నేతల జీత భత్యాలు తడిసి మోపెడు అవుతున్నాయి. సంపాదనే ధ్యేయంగా కొందరి పాలకుల ప్రధాన లక్ష్యంగా మారుతోంది. ప్రజాస్వామ్యంలో అధికారాన్ని ప్రజలే ఇస్తారు. కాబట్టి ప్రజల సంక్షేమం కోసం పనిచేయడం పాలకుల విధి. ప్రభుత్వాలు పారదర్శకంగా వ్యవహరించాలి. ప్రజా ధనాన్ని దుర్విని యోగం చేయరాదు. కానీ నిత్యం జరుగుతున్నది దుర్వినియోగం తప్ప మరోటి కాదు. ప్రజల సమస్యలను వినడం, తెలుసుకోవడం, అభివృద్ధి ఫలాలు అందరికీ చేరేలా చూడడం అన్నది జరగడం లేదు. పాలనలో జవాబుదారీతనం లేకుండా పోతోంది. ఎన్నికల రోజున బలవంతంగా ఓటు వేసి ఐదేళ్లు మౌనంగా ఉండటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. ఇది మన కర్తవ్యాన్ని విస్మరించయడమే అవుతుంది. ప్రజా సమస్యలపై ప్రశ్నించడం, ప్రభుత్వ పనితీరును పరి శీలించడం, తప్పులను ఎత్తి చూపడం, మంచి కార్యక్రమాలను ప్రోత్సహిం చడం ప్రతి పౌరుడు బాధ్య తగా గుర్తించాలి. అధిక జనాభాతో సతమతం అవుతున్న మనం కనీస సౌకర్యాలు లేనప్పుడు జనాభాను పెంచాలన్న పిలుపును వ్యతిరేకించాలి. ఉన్న పౌరులకు ఎలాంటి సౌకర్యాలు ఇస్తున్నారో అడగాలి. గర్భిణీలకు కనీస డెలివరీ సరిపడా ఆస్పత్రులు, వసతులు లేవన్న విషయం పాలకులకు గుర్తు చేయాలి. జనాభా పెరుగుదల అనర్థ హేతవు తప్ప అభివృద్ధి కాదని గుర్తిస్తే మంచిది.

ప్రజా సమస్యలపై ప్రశ్నించడం, ప్రభుత్వ పనితీరును పరి శీలించడం, తప్పులను ఎత్తి చూపడం, మంచి కార్యక్రమాలను ప్రోత్సహిం చడం ప్రతి పౌరుడు బాధ్య తగా గుర్తించాలి. అధిక జనాభాతో సతమతం అవుతున్న మనం కనీస సౌకర్యాలు లేనప్పుడు జనాభాను పెంచాలన్న పిలుపును వ్యతిరేకించాలి. ఉన్న పౌరులకు ఎలాంటి సౌకర్యాలు ఇస్తున్నారో అడగాలి. జనాభా పెరుగుదల అనర్థ హేతవు తప్ప అభివృద్ధి కాదని గుర్తిస్తే మంచిది.



## యుద్ధప్రాతిపదికన ఓటరు జాబితా సవరణ చేపట్టాలి

**ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

**ప్రజానావ, ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో:** సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు శివసేన రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం గోపాల్‌పేట మండల కేంద్రంలో నిర్వహించిన బీఎల్‌ఏల అవగాహన సదస్సుకు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గోపాల్‌పేట, ఏదుల, రేవల్లి మండలాల్లో ఓటరు నమోదు ప్రక్రియ ఆశించిన స్థాయిలో సాగడం లేదని, నిర్లక్ష్యం వహిస్తే అధిష్టానం సీరియస్‌గా ఉంటుందని హెచ్చరిం చారు. మిగిలి ఉన్న 20 రోజుల సమయాన్ని సద్వినియోగం చేసుకుం టూ, ప్రతిరోజూ ఉదయం 7 నుండి 10 గంటల వరకు ఇళ్లకు వెళ్లి అర్హులైన వారందరి ఓట్లను నమోదు చేయాలని సూచించారు. ఓటరు నమోదుతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మండలాల పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, బీఎల్‌ఏలు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- మహబూబ్ నగర్ జిల్లా ఎస్పీ జానకి
- పోలీస్ ప్రధాన కార్యాలయంలో సైబర్ వారియర్స్‌కు ప్రత్యేక శిక్షణ
- వెంటనే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశం



**ప్రజానావ, ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో:** సైబర్ నేరాల పట్ల ప్రతి పోలీసు అధికారి అప్రమత్తంగా ఉంటూ, బాధితు ల ఫిర్యాదులపై తక్షణమే స్పందించి వేగంగా దర్యాప్తు జరపాలని జిల్లా ఎస్పీ డి.జానకి ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలోని సైబర్ వారియర్స్‌కు ప్రత్యక్షంగా, అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సైబర్ నేరాల నివారణ, దర్యాప్తు, ఎన్ సీ ఆర్ పీ పెండింగ్ ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహిం చారు. సైబర్ క్రైమ్ డీఎస్పీ గిరి కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షణలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ మార్గదర్శకా లకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎలా ఉపయో గించాలో వివరించారు. ఆన్‌లైన్ ఆర్థిక మోసాల్లో పోయిన నగదును వీలైనంత త్వరగా రికవరీ చేయడానికి అధికారులు సమన్వయంతో పనిచేయాల ని ఎస్పీ సూచించారు. గ్రీవెన్స్ రీడ్రెస్సల్, మనీ రెస్టో రేషన్ మోడ్యూల్స్, సమన్వయ పోర్టల్ వినియోగం, ఎన్‌సిఆర్‌పి ఫిర్యాదులపై తక్షణమే ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేయడం వంటి అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రజలు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, నకిలీ పెట్టుబడి లింకులు, ట్రేడింగ్, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, కేవైసీ అప్‌డేట్ వంటి మోసపూరిత ప్రకటనలను నమ్మవద్దని ఎస్పీ కోరారు. ఒకవేళ సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుం డా వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని లేదా www.cybercrime.gov.in లో ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ ఎస్సై శ్రావణ్ కుమార్, ఐటీ సెల్ ఎస్సై రవి తదితరులు పాల్గొన్నారు.

# అంతర్‌జిల్లా చోరీల గుట్టురట్టు

- 106 కేసుల్లో నిందితుడి అరెస్ట్
- 22.5 తులాల బంగారం, 60 తులాల వెండి ఆభరణాలు, నగదు స్వాధీనం
- దర్యాప్తు బృందాన్ని అభినందించిన ఎస్పీ పరితోష్ పంకజ్




**ప్రజానావ, జిన్నారం:** పలు జిల్లాల్లో వరుస ఇంటి చోరీలకు పాల్పడుతూ పోలీసులకు తలనొప్పిగా మారిన నిందితుడు కోటపల్లి చంద్రి అలియాస్ శేఖర్‌ను సంగారెడ్డి జిల్లా సీసీఎస్, గుమ్మడిదల పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేసి 22.5 తులాల బంగారు ఆభరణాలు, 60 తులాల వెండి ఆభరణాలు, రూ.25 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ వెల్లడించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిందితుడిపై హైదరాబాద్, సంగారెడ్డి, రంగారెడ్డి, నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో మొత్తం 106 కేసులు నమోదయ్యాయని, వాటిలో 80 పాత కేసులు, 26 తాజా కేసులు ఉన్నాయని తెలిపారు. 2007 నుంచి ఇంటి తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడుతున్న నిందితుడు ఇప్పటివరకు 19 సార్లు జ్యుడీషియల్ రిమాం డ్‌కు వెళ్లగా, 25కుపైగా కేసుల్లో శిక్షలు అనుభవిం చినప్ప టికీ నేరప్రవర్తనలో మార్పు రాలేదన్నారు. 2024లో మేడిపల్లి పోలీసులు అరెస్టు చేసి చర్లపల్లి కేంద్ర కారాగారానికి తరలిం చగా సుమారు 14 నెలలు జైలులో ఉన్నాడని, అనంతరం 2025 అక్టోబర్ 17న బెయిల్‌పై విడుదలైన మూడు రోజులకే మళ్లీ చోరీలకు పాల్పడినట్లు దర్యాప్తులో తేలిందని చెప్పారు. తాళం వేసి ఉన్న ఇళ్లను ముందుగా గుర్తించడం, ఇంట్లో ఎవరూ లేరని నిర్ధారించు కుని వెనుక వైపు నుంచి ప్రవేశించి చోరీలకు పాల్పడడం, అనంతరం తెల్లవారుజాము వరకు సమీపంలోని పొదల్లో తలదాచుకుని అక్కడి నుంచి వెళ్లిపోవడం అతడి నేరశైలిగా గుర్తించినట్లు తెలిపారు. గత ఎనిమిది నెలల్లో మియాపూర్, దుండిగల్, గుమ్మడిదల, హత్నూర, పోచారం ఐటీ కారిడార్, మేడిపల్లి, పటాన్‌చెరు, అబ్దుల్లాపూర్‌మెట్, ఐడీఏ బొల్లారం, వనస్థలిపురం, జీనోమ్ వ్యాలీ, శామీర్‌పేట్, కీసర పోలీస్ స్టేషన్ల పరిధిలో మొత్తం 26 ఇంటి చోరీలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైం దన్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు గుమ్మడిదల మండలంలోని బొంతపల్లి గ్రామ కమాన్ సమీపంలో నిందితుడిని అదుపులోకి తీసుకుని చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు వి. శివకుమార్, చి. ప్రసాద్‌రావు, జిన్నారం సీఐ పి. రమణ రెడ్డి, సీసీఎస్ ఎస్‌ఐ కె. శ్రీకాంత్, గుమ్మడిదల ఎస్‌ఐ కె. అరుణ్ కుమార్‌తో పాటు పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందిం చారు. పటాన్‌చెరు ఎస్‌డీపీఓ ప్రభాకర్ పర్యవేక్షణలో సీసీఎస్, గుమ్మడిదల పోలీసులు సమన్వయంతో పనిచేసి కేసును ఛేదించినట్లు తెలిపారు.

## కేజీబీవీ, మోడల్ స్కూల్లో తనిఖీలు

- మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశం
- నిర్వహణలో నిర్లక్ష్యంపై ప్రిన్సిపాల్‌కు వివరణ కోరిన కలెక్టర్ అనురాగ్ జయంతి

**ప్రజానావ, యాదాద్రి భువనగిరి:** జిల్లాలోని గుండాల మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ), మోడల్ స్కూల్‌ను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మంగళవారం ఆకస్మికం గా తనిఖీ చేశారు. కేజీబీవీలో జరుగుతు న్న మరమ్మ తు పనులను పరిశీలించిన ఆయన వాటిని వేగవం తంగా పూర్తి చేయాలని అధికారుల ను ఆదేశించారు. విద్యార్థినుల అభ్యాసన సామర్థ్యా న్ని పరీక్షించి అభినందించిన కలెక్టర్ హాస్టల్, కిచెన్ షెడ్, మధ్యాహ్న భోజనం, తాగునీటి సదుపాయా లను పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. అనంతరం మోడల్ స్కూల్‌లో తరగతి గదులు, మరుగుదొడ్లను తనిఖీ చేసిన ఆయన నిర్వహణ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. స్కూల్‌కు గ్రాంట్లు విడుదలైనప్పటికీ మరమ్మ తులు చేపట్టకపోవడంపై ప్రిన్సిపాల్‌ను వివరణ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి బిక్షపతి, మండల విద్యా ధికారి మన్నె అగ్గి రాములు, ఎంపీడీవో చండీరాణి, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ ఆర్. విజయలక్ష్మి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాము, దామోదర్, నాజి, లింగయ్య పాల్గొన్నారు.



## హిమాన్షుకు మాజీ సీఎం కేసీఆర్ పరామర్శ

- జిమ్‌లో వ్యాయామం చేస్తుండగా గాయపడిన హిమాన్షు
- ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రం నుంచి ఏఐజీ ఆసుపత్రికి బయలుదేరిన మాజీ సీఎం

**ప్రజానావ, మర్కుక్:** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మనవడు హిమాన్షు జిమ్‌లో వ్యాయామం చేస్తుండగా ప్రమాదవశాత్తు ముక్కుకు గాయమైం ది. దీంతో ఆయనను హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఉన్న ఏఐజీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మర్కుక్ మండలంలోని ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రం నుంచి హిమాన్షును పరామర్శించేందుకు ఏఐజీ ఆసుపత్రికి బయలుదేరారు.

# ఇసుక అక్రమ రవాణా గుట్టురట్టు

- ముగ్గురు అరెస్ట్.. టిప్పర్, కారు, మొబైల్ ఫోన్లు స్వాధీనం
- మరో ఇద్దరి కోసం ప్రత్యేక గాలింపు



**ప్రజానావ, మధిర:** ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను మధిర రూరల్ పోలీసులు పట్టుకున్నారు. మల్లారం క్రాస్‌రోడ్ వద్ద నిర్వహించిన వాహన తనిఖీల్లో ఈ అక్రమ రవాణా వ్యవహారం వెలుగుచూడగా, ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి సుమారు 40 టన్నుల ఇసుకతో ఉన్న టిప్పర్ లారీ, ఎస్కార్ట్‌గా వినియోగించిన కారు, నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం, మంగళవారం రాత్రి మల్లారం క్రాస్‌రోడ్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న సమయంలో అనుమానాస్పదంగా వెళ్తున్న కారును నిలిపి తనిఖీ చేయగా, అందులో ఉన్న వ్యక్తులు ఆంధ్రప్రదేశ్‌లోని ఇబ్రహీంపట్నం ఇసుక రీచ్ నుంచి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను తెలంగాణకు తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్న ట్లు అంగీకరించారు. వారి సమాచారం తో పోలీసులు వెంటనే వెంబడించి సుమారు 40 టన్నుల ఇసుక లోడుతో ఉన్న టిప్పర్ లారీని పట్టుకోగా, మరో రెండు టిప్పర్ లారీలు పోలీసులను గమనించి పరారయ్యా యి. ఈ ఘటనలో కత్రాల గోపి (25), ముక్తవరపు శిఖామణి (36), నారం శెట్టి ఉమామహేష్ అలియాస్ మహేష్ (29)లను అదుపులోకి తీసుకున్నారు. వీరు గతంలో కూడా ఖమ్మం, పరిసర ప్రాంతాలకు పలుమార్లు అక్రమంగా ఇసుకను తరలించి విక్రయిం చినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. పరారీలో ఉన్న మరో ఇద్దరు ప్రధాన నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు. అరెస్టు చేసిన ముగ్గురిని మధిర కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భం గా వైరా ఏసీపీ సారంగపాణి, మధిర రూరల్ సీఐ శ్రీమధు మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని కోరారు. ఈ ముఠాను చాకచక్యంగా పట్టుకున్న మధిర రూరల్ ఎస్‌ఐ విశ్వతేజతో పాటు పోలీసు సిబ్బందిని ఏసీపీ ప్రత్యేకంగా అభినందించారు.

## ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకోవాలి

- ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు తహసీల్దార్లకు కలెక్టర్ కె. హైమావతి ఆదేశాలు

**ప్రజానావ, సిద్దిపేట:** ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా ప్రతి స్థలానికి సమగ్ర సర్వే నిర్వహించి హద్దులు నిర్ధారించి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి తహసీల్దార్లను ఆదేశించారు. మంగళవారం కొండపాక మండలం విశ్వనాథ్‌పల్లి గ్రామంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ముందు భాగం, చిన్నకోడూరు మండలం ఇబ్రహీంనగర్ గ్రామంలోని డంపింగ్ యార్డు పరిసరాలు, కొమురవెల్లి మండలంలో రాజీవ్ రహదారికి సమీపంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం వెనుక ఉన్న ప్రభుత్వ భూములను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లాలోని అన్ని మండలాల్లో ప్రభుత్వ భూముల రికార్డులను పరిశీలించి క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని, ప్రభుత్వ భూముల విస్తీర్ణం, ఆక్రమణకు గురైన భూముల వివరాలను పూర్తిస్థాయిలో సేకరించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూములకు పకడ్బందీగా సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించడంతో పాటు ఫెన్సింగ్ ఏర్పాటు చేసి వాటిని పరిరక్షించాలని సూచించారు. ప్రభుత్వ భూములను అనుమతి లేకుండా ఆక్రమించడం చట్టవిరుద్ధమని పేర్కొన్న కలెక్టర్, అక్రమ కబ్జాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ప్రజా సంక్షేమ పథకాల అమలుకు అవసరమైన భవనాల నిర్మాణంలో ప్రభుత్వ భూములు కీలకమైనవని, వాటి పరిరక్షణ ప్రతి అధికారికి బాధ్యత అని తెలిపారు. ఈ తనిఖీల్లో సంబంధిత మండలాల తహసీల్దార్లు, సర్వేయర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి

- నకిలీ విత్తనాలపై కఠిన చర్యలు తప్పవు
- అధికారులకు కలెక్టర్ బడుగు చంద్రశేఖర్ ఆదేశం

**ప్రజానావ, నల్లగొండ:** ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లేలా వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ బడుగు చంద్రశేఖర్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి వ్యవసాయ అధికారులు, ఏఈఓలు, ఏఓలు, సహాయ వ్యవసాయ సంచాలకులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ నేల స్వభావం, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా వరికి బదులుగా ఇతర పంటల సాగును ప్రోత్సహించాలని సూచించారు. కంది పంటకు కనీస మద్దతు ధర అందుబాటులో ఉన్నందున రైతులను ఆ పంట సాగుకు ప్రోత్సహించాలని, అధిక దిగుబడి వచ్చినా మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తామని తెలిపారు. రైతుల అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన విత్తనాలు తగినంతగా అందుబాటులో ఉంచాలని, నకిలీ విత్తనాల విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నందున రైతులు యాప్ ద్వారా బుకింగ్ చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకునేలా చర్యలు తీసుకోవాలని, ఆగస్టు 5 నాటికి కనీసం 75 శాతం నమోదు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రైతు వేదికల్లో వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉండి విత్తనాలు, ఎరువుల నిల్వలు, సరఫరా సమయాల వివరాలను స్పష్టంగా ప్రదర్శించేలా బ్యానర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్‌తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఆటో కార్మికుల హామీలను వెంటనే అమలు చేయాలి

**ఖమ్మం కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా**

**ప్రజానావ, ఖమ్మం:** ఆటో కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆటో కార్మికులు ఖమ్మం జిల్లా కలెక్టరేట్ ఎదుట మంగళవారం ధర్నా నిర్వ హించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడు తూ ఆటో కార్మికులకు ప్రతి ఏడాది రూ.12 వేల ఆర్థిక సాయాన్ని వెంటనే అందించడంతో పాటు పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ, ఎల్‌పీజీ ఇంధన ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్ల కుటుంబాలకు ఉచిత జీవిత బీమా, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని కోరారు. స్థానిక ఆటో కార్మికుల ఉపాధిపై తీవ్ర ప్రభావం చూపుతున్న ఓలా, రాపిడో వంటి ఆన్‌లైన్ యాప్ సేవలను తక్షణమే నిలిపివే యాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు ఆటో కార్మికులకు రూ.12 వేల ఆర్థిక సాయం, ఉచిత బీమా కల్పిస్తామని హామీ ఇచ్చిన పాలకులు అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయలేదని ఏఐటీయూసీ ప్రతినిధులు విమర్శించా రు. ఇలాంటి పరిస్థితుల్లో ఆన్‌లైన్ యాప్ సేవలను నియంత్రిస్తేనే ఆటో కార్మికుల కుటుంబాలకు జీవనోపాధి కల్పించగలమ న్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అర్హులైన ప్రతి ఆటో కార్మికుడికి రూ.12 వేల ఆర్థిక సాయం, ఇందిరమ్మ ఇల్లు లేదా ప్రభుత్వ స్థలం కేటాయించాల ని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.



## సింగరేణి కార్మికులకు శుభవార్త

- క్రేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్‌రెడ్డి హామీ
- ఐఎన్‌టీయూసీ విజ్ఞప్తికి సానుకూల స్పందన
- అధికారిక ప్రకటనకు రంగం సిద్ధం

**ప్రజానావ, రామగుండం:** సింగరేణి సంస్థ భవిష్యత్ అవసరాలు, దేశంలో రోజురోజుకూ పెరుగుతున్న బొగ్గు డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని తాడిచర్ల–2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణి సంస్థకే కేటాయించాలని చేసిన విజ్ఞప్తికి కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ డా. జనక్ ప్రసాద్ వెల్లడించారు. సింగరేణి సంస్థకు బొగ్గు బ్లాక్‌ల కేటాయింపు, నూతన ఓపెన్‌కాస్ట్ గనులకు అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన గతంలో పలుమార్లు కేంద్ర మంత్రిని కలిసి కోరినట్లు తెలిపారు. ముఖ్యంగా తాడిచర్ల–2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణికే కేటాయించాలని విజ్ఞప్తి చేయగా, కార్మికుల సంక్షేమం, సంస్థ భవిష్యత్ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఆ బ్లాక్‌ను సింగరేణి సంస్థకే కేటాయించాలని నిర్ణయించినట్లు కేంద్ర మంత్రి తనకు మంగళవారం ఫోన్ ద్వారా స్వయంగా తెలియజేశారని జనక్ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ నిర్ణయంపై ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు డా. జి. సంజీవ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. దీనికి సంబంధించి మంగళవారం సాయంత్రం అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని ఆయన తెలిపారు. తాడిచర్ల–2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణి సంస్థకు కేటాయించే విషయంలో కీలక పాత్ర పోషించిన కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్‌రెడ్డికి సింగరేణి కార్మికుల తరఫున, ఐఎన్‌టీయూసీ పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు డా. జనక్ ప్రసాద్ పేర్కొన్నారు.

## 9వ రోజుకు చేరిన సింగరేణి అధికారుల రిలే దీక్షలు

- ఆర్జీ–1, ఆర్జీ–2 ఏరియాల్లో కొనసాగుతున్న నిరసనలు
- ఏఐటీయూసీ, హెచ్‌ఎంఎస్, బీఎంఎస్ నాయకుల సంఘీభావం
- న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని అధికారుల డిమాండ్




**ప్రజానావ, రామగుండం:** ఆర్జీ–1, ఆర్జీ–2 ఏరియాల జనరల్ మేనేజర్ కార్యాలయాల ఎదుట సింగరేణి అధికారుల సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 9వ రోజుకు చేరుకున్నాయి. అధికారుల న్యాయమైన డిమాండ్లను యాజమాన్యం తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఈ నిరసన కార్యక్రమాన్ని అధికారులు కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా అధికారుల సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ అధికారుల వేతనాల అప్‌గ్రేడేషన్‌ను వెంటనే అమలు చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న ఇతర న్యాయమైన సమస్యలను కూడా ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. సింగరేణి అధికారులు చేపట్టిన రిలే దీక్షల శిబిరాన్ని ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ మద్దె ఎల్లాగౌడ్, బ్రాంచ్ కార్యదర్శి రంగ శ్రీను, హెచ్‌ఎంఎస్, బీఎంఎస్ నాయకులు రియాజ్ అహ్మద్, యాదగిరి, సత్తయ్య, మాజీ మేయర్ అనిల్ కుమార్ తదితరులు సందర్శించి సంఘీభావం ప్రకటించారు. దీక్షలో అధికారులు రవీందర్ రెడ్డి, హనుమంతరావు, అనిల్ గబాలే తదితరులు పాల్గొనగా, ఎస్‌వో టు జీఎం చంద్రశేఖర్ దీక్షా శిబిరాన్ని సందర్శించి అధికారులకు తన మద్దతు తెలిపారు.

## ప్రేమ ఉంటే సింగరేణికి కొత్త బొగ్గు బ్లాకులు కేటాయించండి

- వేలంపాటలకు బదులుగా నేరుగా బ్లాకులు ఇవ్వాలి
- కేంద్ర మంత్రికి టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి డిమాండ్




**ప్రజానావ, రామగుండం:** సింగరేణి సంస్థ పట్ల నిజమైన ప్రేమ, కార్మికుల సంక్షేమంపై చిత్తశుద్ధి ఉంటే బొగ్గు బ్లాకులను వేలంపాటలోకి తీసుకురాకుండా నేరుగా సింగరేణికే కేటాయించాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ సహాయ మంత్రి జి. కిషన్‌రెడ్డిని టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్ర మంత్రి నిర్వహించిన సింగరేణి సమీక్షా సమావేశం వల్ల సంస్థకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదన్నారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలను రాజకీయంగా కాపాడేందుకే ఆ సమావేశం నిర్వహించినట్లు ఆరోపించారు. సింగరేణిలో వెలుగుచూసిన బొగ్గు కుంభకోణం, డీజిల్ కొనుగోళ్లు, పేలుడు పదార్థాల కొనుగోళ్లు, ఓవర్‌బర్డెన్ తొలగింపు టెండర్లు, సోలార్ ప్లాంట్ల ఏర్పాటులో జరిగినట్లు ఆరోపణలు ఉన్న అక్రమాలపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారో ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. బొగ్గు నిల్వల వ్యవహారంపై సింగరేణి యాజమాన్యంతోనే విజిలెన్స్ విచారణ చేయించడం దొంగకే తాళం చెవులు అప్పగించినట్లేనని విమర్శించారు. ఈ సమావేశంలో టీబీజీకేఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రామమూర్తి, సీనియర్ ఉపాధ్యక్షుడు నూనె కొమురయ్య, అధికార ప్రతినిధి పర్లపల్లి రవి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ జాహిద్ పాషా, నాయకులు పోలాడి శ్రీనివాసరావు, ఐ. సత్యం, ఏ. గోపి, అక్తార్ పాషా, రోడ్డ సంపత్, పులిపాక శంకర్, వి. గౌడ్, రాజ్‌కుమార్ చారి, గుమ్మడి సుందర్ తదితరులు పాల్గొన్నారు.

Singareni news

# స్వార్థ ప్రయోజనాల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం

- ఎండాకాలంలో నిర్మాణం చేస్తే వానా కాలంలో కూలిపోయే ప్రాజెక్టులు బీఆర్ఎస్ కట్టినవి
- రాష్ట్రంలో ఉన్న ప్రాజెక్టులన్నీ కాంగ్రెస్ హయాంలోనివే
- ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు



**ప్రజానావ, పెద్దపల్లి :** జిల్లా కేంద్రంలోని నందన గార్డెన్స్ లో స్థానిక కాంగ్రెస్ నాయకులతో ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ మీడియా సమావేశంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా బిఆర్ఎస్ నాయకులు కాళేశ్వరం ప్రాజెక్టు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల, ప్రాజెక్టులపై రైతులకు ప్రజలకు విష ప్రచారాన్ని చేరవేస్తున్నారని, ఎవరి ప్రయోజనాల కోసం చేస్తున్నారో ప్రజలకు, రైతులకు తెలుసన్నారు. రైతన్ననికి అవసరమైన నీరు అందించేందుకు పైపుల ద్వారా ఎత్తిపోసే అవసరం లేకుండానే తుమ్మడి హెట్టిని ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి తూమ్మిడి ఎట్టి నుండి ఎల్లంపల్లి కి నీరును తీసుకువచ్చే విధంగా రూపకల్పన చేపట్టారని తెలిపారు. బి.ఆర్.ఎస్ ప్రభుత్వం ఒక లక్ష కోట్ల రూపాయలతో ప్రజా ధనాన్ని వెచ్చించి కాళేశ్వరం ప్రాజెక్ట్ తమ స్వార్ధ ప్రయోజనాల కోసం వారి కుటుంబ ప్రయోజనాల కోసం నిర్మాణం చేపట్టారని అన్నారు. ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా నీళ్లను కింది నుండి పైకి ఎత్తిపోసే ప్రాజెక్ట్ కెసిఆర్ ఇంజనీర్ అవతారం ఎత్తి నిర్మించారని ఆ ప్రాజెక్టు నాలుగు నుండి ఐదు సంవత్సరాల కాలంలో ఒక సంవత్సరానికి 180 టీఎంసీల చొప్పున నీళ్ళు ఎత్తి పోసారని అబద్దపు మాటలు చెప్పి పబ్బం గడిపారు. అలా అయితే ఐదు సంవత్సరాల కాలంలో 900 టీఎంసీల నీరును పోయాల్సి ఉండగా 74.5 టిఎంసిల నీళ్లను మూడు ప్రాంతాలు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల లిఫ్ట్ ల ద్వారా ఎల్లంపల్లికి పంపిణీ చేసి ఎల్లంపల్లి లో ఉన్న 40 టీఎంసీల నీరును కలుపుకొని కేవలం 114 టీఎంసీల నీళ్లను ఐదు సంవత్సరాలలో ఎత్తిపోసారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ తెలంగాణ మానస పుత్రిక అని, ప్రపంచంలో ఎనిమిదో వింత అని సొంత బస్సులలో రైతులను, ప్రజలను తరలించి టూరిజం ప్రాజెక్టుగా చూపించారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుండి ఎస్సారెస్పీ ఎల్లంపల్లి వరద కాలువల ద్వారా ఈ రాష్ట్ర రైతాంగానికి కాళేశ్వరం తో సంబంధం లేకుండా గతంలో ఎన్నడు లేని విధంగా 83 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతంగం పండించేందుకు నీరును అందించడం జరిగిందన్నారు. పీవీ నరసింహా రావు దేశ ప్రధానిగా ఉన్న సమయంలో 200 కోట్లతో వరద కాలువలకు శంకుస్థాపన చేపట్టారని అప్పటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి వరద కాలువలను పూర్తి చేసి ఎస్సారెస్పీ ద్వారా రెండు డ్యాములు నింపారని తెలిపారు. తుమ్మిడి ఎట్టి దగ్గర ప్రాజెక్టు నిర్మాణానికి వైయస్ రాజశేఖర్ రెడ్డి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి ఐదున్నర కోట్ల రూపాయలను కాంగ్రెస్ ప్రభుత్వం ఖర్చు పెట్టి వరద కాలువల నిర్మాణం చేపట్టిందని 182 కిలోమీటర్ల పైన కాలువల నిర్మాణం పూర్తయిందని వివరించారు. ఈ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉత్తమ్ కుమార్ రెడ్డిలు లేఖ ఇచ్చారని వివరించారు. మీ పాలనలో ఎండాకాలంలో ప్రాజెక్టులు మొదలుపెడితే వానకాలంలో కూలిపోయే పరిస్థితిలో నెలకొన్నాయని దానికి నిదర్శనమే కాళేశ్వరం ప్రాజెక్టు అని వివరించారు. హుస్సేమియా వాగులపై నిర్మాణం చేసిన చెక్ డ్యాముల సైతం కూలిపోయాయి పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేపడుతున్న సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టు అక్రమాలను బయట పెడుతుంటే అప్పటి మంథని ఎమ్మెల్యే శ్రీధర్ బాబు ని అడ్డుకున్న చరిత్ర బిఆర్ఎస్ పార్టీ వరిదని వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా పెద్దపల్లి, ధర్మారం, మంథని ప్రాంతాలకు నీళ్లు ఇచ్చిన పాపాన పోలేదని అన్నారు. ఈ రాష్ట్రంలో ఉన్న ప్రాజెక్టులన్ని నాగార్జునసాగర్, పులిచింతల, హుస్సేన్ సాగర్, శ్రీశైలం, ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి, మిడ్ మానేరు లోయర్ మానేరు ఏకశిలా, ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మాణమయ్యాయని ఇప్పటివరకు చెక్కుచెదరకుండా ఉన్నాయని తెలిపారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో మా ప్రాంతాల నుండి నీళ్ల తీసుకుపోయి మీరు ఈ ప్రాంతంలో వాడుకున్నదీ నిజం కాదా అని ప్రశ్నించారు. పెద్దపల్లి టేలెంట్ ప్రాంతం పూర్తిగా బిఆర్ఎస్ ప్రభుత్వం హయంలో ఎండిపోయిందని ఎద్దేవా చేశారు. అబద్దాలను ప్రజలకు చెప్పడం మానేసి అవసరమైన సలహాలు సూచనలు అందించాలే తప్ప మోసపు మాటలు చెప్పడం మానుకోవాలని అన్నారు. హరీష్ రావు కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంతం సశ్యామలమవుతుందని అబద్ధపు మాటలు చెప్పారే తప్పా ఈ ప్రాంతానికి నీరు అందించిన దాఖలాలు లేవన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్లు, పట్టణ కౌన్సిలర్లు, పలు గ్రామాల సర్పంచ్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

- టెక్డిగూడలో నూతన గిరిజన ప్రాథమిక పాఠశాల భవనాన్ని ప్రారంభించిన కలెక్టర్ రాజర్షి షా



**ప్రజానావ, ఆదిలాబాద్:** గిరిజన విద్యార్థులకు వారి ఆవాసాల్లోనే నాణ్యమైన విద్యను అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. భీంపూర్ మండలం టెక్డిగూడ గ్రామంలో నిర్మించిన ప్రభుత్వ గిరిజన ప్రాథమిక పాఠశాల నూతన భవనాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల పఠన సామర్థ్యాలను పరిశీలించిన కలెక్టర్, వారి ప్రతిభా నైపుణ్యాలను అభినందించారు. గతంలో శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం కారణంగా బెల్సాయి రాంపూర్, టేకడి రాంపూర్ గిరిజన ప్రాథమిక పాఠశాల హనుమాన్ ఆలయ మందిరంలో కొనసాగేదని, గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు తక్షణమే నిధులు మంజూరు చేసి నూతన భవన నిర్మాణం పూర్తి చేయడం ఆనందంగా ఉందన్నారు. చిన్నతనం నుంచే పిల్లలకు భాషా నైపుణ్యాలు, ప్రాథమిక గణితంపై పట్టు ఏర్పడితే ఉన్నత విద్యను సులభంగా అభ్యసించగలరని పేర్కొన్నారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రతిరోజూ పాఠశాలకు పంపడంతో పాటు ఉపాధ్యాయులు ఇచ్చే హోంవర్క్‌ను తప్పనిసరిగా చేయించేలా శ్రద్ధ వహించాలని సూచించారు. పాఠశాలకు అవసరమైన మరిన్ని మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చిన కలెక్టర్, భవన నిర్మాణానికి సహకరించిన ఐటీడీఏ, ఇంజినీరింగ్ శాఖ అధికారులు, గ్రామస్థులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కను నాటి, గ్రామంలోని ప్రతి ఇంటికి ఐదు మొక్కల చొప్పున పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన, ఇప్పటివరకు ప్రారంభం కాని ఇళ్ల నిర్మాణాలను పక్షం రోజుల్లోగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏటీడీఓ నిహారిక, హౌసింగ్ పీడీ శంకర్, తహసీల్దార్ రమేష్, ఎంఈఓ రాధాకృష్ణ, సర్పంచ్ కేశవ్, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదాల నివారణకు విద్యుత్ సిబ్బంది భద్రత సూచనలు పాటించాలి

పెద్దపల్లి డిఈ రాజ బ్రహ్మచారి

ప్రజానావ, పెద్దపల్లి : ప్రమాద నివారణ సిబ్బందికి భద్రత సూచనలు పాటించాలని పెద్దపల్లి డిఈ రాజ బ్రహ్మచారి సూచనలు చేశారు. మెరుగైన విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని పెద్దపల్లి డిఈ రాజ బ్రహ్మచారి ఇటీవల పెద్దపల్లి ఏడిఈగా బాధ్యత చేపట్టిన తోట మల్లేశం వారితో కలిసి పెద్దపల్లి టౌన్–1 సెక్షన్ కార్యాలయాన్ని సందర్శించారు. విద్యుత్ అంతరాయం ఏర్పడిన వెంటనే వీలైనంత త్వరగా చూడాలని సూచించారు. విద్యుత్ వినియోగదారుల సమస్యలను త్వరగా పరిష్కరించాలని కోరారు. ప్రతినెల విద్యుత్ బిల్లులను ఆదే నెలలోనే వసూలు చేయాలని తెలిపారు. అన్ని పారామీటర్స్ పైన సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. అలాగే పెద్దపల్లి టౌన్ అన్నీ పారామీటర్స్ లో ముందు వుండాలని వారు ఆకక్షించారు. ఈ రివ్యూ మీటింగ్ లో అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ సబ్ ఇంజనీర్ శ్రీనివాస్, సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.



## పెరిగిన గోదావరి ప్రవాహం

- కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద 6 మీటర్ల నీటిమట్టం
- 85 గేట్లు ఎత్తి 1.22 లక్షల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల

**ప్రజానావ, మహాదేవపూర్:** ఎగువన మహారాష్ట్రలో గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో ప్రాణహిత నదిలో వరద ప్రవాహం పెరగడంతో మహాదేవపూర్ మండలంలోని కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ప్రస్తుతం త్రివేణి సంగమం వద్ద గోదావరి నీటిమట్టం 6 మీటర్లకు చేరుకుంది. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్న అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా మేడిగడ్డ బ్యారేజీకి చెందిన 85 గేట్లను ఎత్తి సుమారు 1.22 లక్షల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. వరద పరిస్థితుల దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

## నకిలీ విత్తనాలు అమ్మిన, రవాణా చేసిన చర్యలు తప్పవు

- నకిలీ విత్తనాల విక్రయాలలో తరచూ కేసులు నమోదైతే పీడీ యాక్ట్ అమలు
- నకిలీ విత్తనాల అక్రమ రవాణా నియంత్రణకు పోలీస్, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు
- జిల్లా ఎస్పీ మహేష్ బి.గీతే



ప్రజానావ, సిరిసిల్ల : నకిలీ విత్తనాలను విక్రయించినా,రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని, తరచూ ఇలాంటి కేసుల్లో పట్టుబడే వారిపై పీడీ యాక్ట్ అమలు చేస్తామని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే హెచ్చరించారు. మంగళవారం పోలీస్, వ్యవసా య శాఖ ఆధ్వర్యంలో స్పెషల్ టీమ్ లు ఏర్పాటు చేసి జిల్లా వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ఎరువుల, విత్తనాల, పురుగుమందుల స్టాక్ రిజిస్టర్స్, విక్రయ రికార్డులు, లైసెన్సులు, నిల్వలు, బిల్ రసీదులను పరిశీలించి మొదలైన అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.... జిల్లాలో నకిలీ విత్తనాల అక్రమ రవాణా, విక్రయాలను అడ్డుకోవడానికి, పోలీస్, వ్యవసాయ అధికారులచే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు. గతంలో నకిలీ విత్తనాలు అమ్మిన వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని, వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించడం జరుగుతుందని, నకిలీ విత్తనాలు కలిగి ఉన్నా, అమ్మిన, రవాణా చేసిన వ్యక్తుల పై పీడీ యాక్ట్ చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి జైలుకు పంపడం జరుగుతుందన్నారు. రాబోవు నెల రోజులు చాలా కీలకమని జిల్లాలో ఒక్క రైతుకు కూడా నకిలీ విత్తనాలతో మోసపోకుండా చూసే బాధ్యత వ్యవసాయ అధికారులు, పోలీసు అధికారులు పై ఉంటుందని, జిల్లాలో ఉన్న ఫర్టిలైజర్ షాప్, సీడ్స్ షాప్స్ పై నిఘా ఉంచి నకిలీ విత్తనాల విక్రయాలను, రవాణాను అరికట్టడం జరుగుతుందన్నారు. రైతులు సీడ్స్ అండ్ ఫెర్టిలైజర్స్ షాప్ నుండి విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తప్పకుండా బిల్ తీసుకోవాలని సూచించారు. జిల్లా ప్రజలకు, రైతులకు ఎవరైనా నకిలీ విత్తనాలు, నకిలీ పురుగుల మందులు అమ్ముతున్నారని సమాచారం ఉంటే పోలీస్ వారికి సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు.




## కులం పేరుతో దూషించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

**ప్రజానావ, పెద్దపల్లి :** కులం పేరుతో దూషించి, ప్రాణహాని కలిగించేలా బెదిరించిన వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కఠిన చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని పాలకుర్తి మండలం రాణపూర్ గ్రామానికి చెందిన మడిపెల్లి లక్ష్మయ్య డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లక్ష్మయ్య కథనం ప్రకారం, తనకు చెందిన వ్యవసాయ భూమి మీదుగా రోడ్డు నిర్మాణం చేపడుతూ, తన అనుమతి లేకుండానే భూమిలోని మట్టిని తొలగించారని తెలిపారు. అంతేకాకుండా, తన తండ్రి మృతదేహాన్ని ఖననం చేసిన స్థలాన్ని కూడా తవ్వి, అక్కడి అవశేషాలను పక్కకు పడేశారని ఆరోపించారు. ఈ విషయంపై ప్రశ్నించేందుకు వెళ్లిన సమయంలో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన బయ్యపు మనోహర్ రెడ్డి తనను ఎస్సీ కులం పేరుత్తో దూషించ్చడంతో పాటు అసభ్య పదజాలంతో అవమానించి, చంపేస్తాను అంటూ బెదిరించాడని పేర్కొన్నారు. అంతేకాకుండా, రోడ్డు వేయడానికి కలెక్టర్ అనుమతి ఇచ్చారు. నువ్వు అడిగే హక్కు లేదు. దళితుడివి కాబట్టి బతికి పోయావు, బీసీ కులానికి చెందినవాడివైతే ఇప్పుడే చంపేసేవాడిని అంటూ తన అనుచరుల సమక్షంలో బెదిరించాడని లక్ష్మయ్య ఆరోపించారు. ఈ ఘటనను బాలగాని కుమార్, సంగెం నర్సయ్య, కాంద్ర శంకర్ తదితరులు ప్రత్యక్షంగా చూశారని తెలిపారు. ఘటనపై సంబంధిత పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బయ్యపు మనోహర్ రెడ్డి వల్ల తనకు, తన కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉందని పేర్కొన్న లక్ష్మయ్య, తనపై కులం పేరుతో దూషించి, బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంతో పాటు ఇతర సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులను కోరారు.

## సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- విజయవాడలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో భారీ ధర్నా
- ప్రభుత్వ హామీతో ఆందోళన విరమణ

**ప్రజానావ, కామారెడ్డి:** రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఏఐటీయూసీ) అనుబంధ ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో విజయవాడ ధర్నా చౌక్‌లో మంగళవారం భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా నియమించాలని, నెలకు కనీస వేతనాన్ని రూ.36 వేలుగా నిర్ణయించాలని, సుప్రీంకోర్టు తీర్పును వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే మున్సిపల్ కార్మికులకు సబ్బులు, యూనిఫాంలు, బ్లౌజులు, చెప్పులు తదితర రక్షణ సామగ్రిని ప్రభుత్వం ఉచితంగా అందించాలని కోరారు. ధర్నా అనంతరం మున్సిపల్ శాఖ రాష్ట్ర కార్యాలయానికి వెళ్లేందుకు నాయకులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో స్వల్ప ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అనంతరం పోలీసు అధికారులు జోక్యం చేసుకుని మున్సిపల్ శాఖ అధికారులను ధర్నా చౌక్‌కు రప్పించి కార్మిక సంఘాల ప్రతినిధులతో చర్చలు జరిపించారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో మున్సిపల్ కార్మికులు తమ ఆందోళనను విరమించారు.



# ఈ20 పెట్రోల్‌తో ఏ కారుకూ సమస్య రాలేదు

- మంత్రి నితిన్ గడ్కరీ
- ఇథనాల్ మిశ్రమ ఇంధనంపై తప్పుడు ప్రచారం జరుగుతోందని వ్యాఖ్య
- ఒక్క కారు పేరు చెప్పాలని విమర్శకులకు సవాల్
- ఇథనాల్‌తో రైతులకు రూ.45 వేల కోట్ల అదనపు ఆదాయం వచ్చిందని వెల్లడి

**న్యూఢిల్లీ:** ఈ20 (20 శాతం ఇథనాల్ మిశ్రమ) పెట్రోల్ వినియోగం వల్ల దేశంలో ఏ కారుకూ సమస్యలు ఎదురుకాలేదని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ స్పష్టం చేశారు. ఇథనాల్ మిశ్రమ ఇంధనంపై తప్పుడు ప్రచారం జరుగుతోందని ఆరోపిస్తూ, ఈ20 పెట్రోల్ వల్ల సమస్యలు ఎదుర్కొన్న ఒక్క కారు పేరైనా చెప్పాలని విమర్శకులకు సవాల్ విసిరారు.

### తప్పుడు ప్రచారం

వికసిత్ భారత్ కాన్క్లేవ్‌లో మాట్లాడిన గడ్కరీ.. ఈ20 పెట్రోల్‌తో వాహనాల పనితీరుపై ఎలాంటి సమస్యలు నమోదుకాలేదని అన్నారు. అధిక ఇథనాల్ మిశ్రమ పెట్రోల్ అమలుపై కొందరు ఉద్దేశపూర్వకంగా చెల్లింపు ప్రచారం (పెయిడ్ క్యాంపెయిన్) నిర్వహిస్తున్నారని విమర్శించారు. ప్రస్తుతం భారత్ పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ మిశ్రమ లక్ష్యాన్ని ఇప్పటికే సాధించిందని తెలిపారు. దేశంలో ఇథనాల్ ఉత్పత్తి అధికంగా ఉండటంతో మొక్కజొన్న నుంచి ఇథనాల్ తయారీకి ప్రోత్సాహం ఇచ్చామని, దీంతో ఉత్తరప్రదేశ్, బీహార్ రైతులకు అదనంగా రూ.45 వేల కోట్ల ఆదాయం లభించిందని గడ్కరీ చెప్పారు. గతంలో క్వింటాల్ మొక్కజొన్న ధర రూ.1,200 ఉండగా, ఈ నిర్ణయం తర్వాత రూ.2,800కు పెరిగిందని వివరించారు.

### ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాలకు ప్రోత్సాహం

శిలాజ ఇంధనాల దిగుమతుల కోసం దేశం ఏటా రూ.22 లక్షల కోట్లు ఖర్చు చేస్తోందని, స్వచ్ఛ ఇంధనాల వినియోగం ఆర్థిక, పర్యావరణ పరంగా అవసరమని గడ్కరీ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈ85, ఈ100 ఇథనాల్, బీ100 బయోడీజిల్, హైడ్రోజన్-సీఎన్‌జీ వంటి ప్రత్యామ్నాయ ఇంధనాలతో నడిచే ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాలకు అవకాశం కల్పించేలా కేంద్ర మోటారు వాహన నిబంధనల్లో సవరణలను కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించినట్లు తెలిపారు.





# ముంబైని ముంచెత్తిన జోరువాన

- మహారాష్ట్రలో పలు ప్రాంతాల్లో 600 మిమీ వర్షపాతం
- ముంబై వీధులన్నీ జలమయం.. బయటకు రావొద్దని హెచ్చరిక

**ముంబై :** దేశ ఆర్థిక రాజధాని ముంబైతో పాటు మహారాష్ట్రలోని పలు ప్రాంతాల్లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ముంబైలోని అనేక లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులపై నీరు నిలవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రైలు సేవలు చాలా వరకు నిలిచిపోయాయి. కొన్ని విమాన సర్వీసులు రద్దు కాగా, వందలాది విమానాలు ఆలస్యంగా నడిచాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గత 24 గంటల వ్యవధిలో మహారాష్ట్రలోని పలు ప్రాంతాల్లో 600 మిలీ వూటర్ల వర్షం కురిసింది. దీంతో ముంబై–పుణె మార్గంలోని కర్జత్–లోనావాలా ఘాట్ రోడ్డులో భారీగా కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో ఆ రూట్‌లో రెండ్రోజులుగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఇక, పుణె జిల్లాలోని ప్రముఖ హిల్ స్టేషన్ అయిన లోనవాలాలో గత 24 గంటల వ్యవధిలో 670 మిల్లీవూటర్ల వర్షం కురిసింది. ముంబై, థానే, పుణె, పాల్ఘర్ ప్రాంతాల్లో పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటించారు. ఐఎండీ తాజా అంచనాల ప్రకారం, మహారాష్ట్రలోని కోంకణ్ ప్రాంతంతో పాటు పశ్చిమ కనుమల పరిసరాల్లో మరో రెండు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కొనసాగే అవకాశం ఉంది. పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్న అధికారులు అవసరమైన సహాయక చర్యలు చేపడుతున్నారు. ఇక, ముంబైలో మంగళవారం డా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో వాతావరణ విభాగం ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఇప్పటి ముంబై నగరం జలమయంగా మారింది. దీంతో అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని ప్రజలకు అధికారులు సూచించారు.

### గుజరాత్‌లో భారీ వర్షాలు

భారీ వర్షాలకు గుజరాత్‌లోని నీటి పారుదల ప్రాజెక్టులు జలకళ సంతరించుకుంటున్నాయి. జోరువానలు గుజరాత్ అంతటా విస్తారంగా కురుస్తున్నాయి. దీంతె వాగులు వంకలు పొంగుతున్నాయి. భావ్‌నగర్ జిల్లా పాలితానాలోని శెత్రుంజీ డ్యామ్‌కు వరద పోటెత్తింది. ఈ నేపథ్యంలో జలాశయం 59 గేట్లను ఎత్తి అధికారులు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జలాశయం నుంచి వరద నీరు ఉప్పొంగి ప్రవహిస్తున్న దృశ్యాలు ఆకట్టుకుంటున్నాయి.

## కశ్మీర్‌ను ముంచెత్తిన భారీ వర్షాలు

- దోడా జిల్లాలో ఆకస్మిక వరదలు
- విరిగిపడ్డ కొండచరియచలు

**శ్రీనగర్:** భారీ వర్షాలు జమ్మూకశ్మీర్‌ను అతలాకుతలం చేస్తున్నాయి. డోడా జిల్లాలో మంగళవారం ఆకస్మిక వరదలు సంభవించాయి. పలు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడ్డాయి. ఎగువ ప్రాంతాల నుంచి వరద, బండరాళ్లు కొట్టుకురావడంతో తాత్రి పట్టణంలో పలువురి ఇళ్లు, దుకాణాలు, వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ప్రాణనష్టం ఏవూ జరగలేదని అధికారులు తెలిపారు. గత రెండు రోజులుగా డోడా, కిష్త్వార్ జిల్లాల్లో ఆకస్మిక వరదలు రావడం ఇది మూడోసారి. మంగళవారం సంభవించిన వరదలకు తాత్రి పట్టణంలో రోడ్డుపక్కన నిలిపిన అనేక వాహనాలు మట్టిలో రుకుపోగా, కొన్ని చీనాబ్ నదిలో కొట్టుకుపోయినట్లు స్థానికులు తెలిపారు. నష్టం ఎంత మేరకు జరిగిందనే విషయాన్ని అధికారులు అంచనా వేస్తున్నారు. వరదల కారణంగా డోడా–కిష్త్వార్ జాతీయ రహదారి తాత్రి వద్ద మూసుకుపోయింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. రహదారిని పునరుద్ధరించే పనులను అధికారులు చేపట్టారు. వదంతులు నమ్మవద్దని, ప్రజలు అధికారిక సమాచారం కోసం కంట్రోల్ రూం లేదా జిల్లా యంత్రాంగాన్ని సంప్రదించాలని డిప్యూటీ కమిషనర్ కృష్ణన్ లాల్ సూచించారు.

# హోర్ముజ్ జలసంధిలో మరోసారి ఉద్రిక్తత

**టెహ్రాన్ :** హోర్ముజ్ జలసంధిలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. హోర్ముజ్‌లో ప్రయాణిస్తున్న రెండు నౌకలపై ఇరాన్ రెవల్యూషనరీ కార్ప్స్ గార్డ్స్ దాడులు చేసింది. రెండు నౌకలపై మిస్సైల్స్ ప్రయోగించింది. ఈ దాడుల్లో రెండు నౌకలు దెబ్బతిన్నాయి. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఈ విషయాన్ని అమెరికా అధికారులు వూడియాకు వెల్లడించారు. కాగా, మూడు వారాల క్రితం అమెరికా, ఇరాన్ దేశాలు మెమొరాండవ్ ఆఫ్ అండర్‌స్టాండింగ్‌పై సంతకాలు చేశాయి. ఈ ఒప్పందం ప్రకారం హోర్ముజ్ జలసంధిలో దాడులు ఆపేస్తామని ఇరాన్ ప్రకటించింది. రెండు దేశాల మధ్య శాంతి ఒప్పందం జరిగిన తర్వాత కూడా ఇరాన్ దాడులకు పాల్పడటంపై అమెరికా ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. మరో ఘటనలో.. ఒమన్‌లో ని లిమా తీరంలో దక్షిణ దిశగా ప్రయాణిస్తున్న ఓ ఆయిల్ ట్యాంకర్‌ను పేలుడు వస్తువు బలంగా ఢీకొట్టింది. దీని కారణంగా ఆ నౌక ఎడమ వైపు భాగంలో భారీగా మంటలు చెలరేగాయి. బ్రిటీష్ మిలిటరీకి చెందిన 'యునైటెడ్ కింగ్‌డవ్ మారిటైవ్ ట్రేడ్ ఆపరేషన్స్' ఈ ప్రమాదాన్ని అధికారికంగా ధ్రువీకరిస్తూ ప్రకటన విడుదల చేసింది.

# గుజరాత్ హైకోర్టు సంచలన తీర్పు

- 2008 వరుస బాంబు పేలుళ్ల కేసులో 38మందికి ఉరి
- మరో 11 మందికి యావజ్జీవ కారాగార శిక్ష విధింపు
- ప్రత్యేక కోర్టు తీర్పును సమర్థించిన హైకోర్టు



**అహ్మదాబాద్ :** దేశాన్ని ఉలిక్కిపడేలా చేసిన 2008 అహ్మదాబాద్ వరుస బాంబు పేలుళ్ల సులో గుజరాత్ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ప్రత్యేక కోర్టు 2022లో విధించిన శిక్షలను సమర్థిస్తూ 38 మంది దోషులకు ఉరిశిక్షను, మరో 11 మందికి యావజ్జీవ కారాగార శిక్షను హైకోర్టు మంగళవారం ఖరారు చేసింది. ఈ సులో దాఖలైన అప్పీళ్లపై సుదీర్ఘ విచారణ అనంతరం న్యాయస్థానం ఈ తీర్పును వెలువరించింది 2008, జులై 26న అహ్మదాబాద్‌లో వలం 70 నిమిషాల వ్యవధిలో 21 చోట్ల బాంబు దాడులతో ఉగ్రవాదులు విరుచుకుపడ్డారు. ఈ దాడుల్లో 56 మంది మరణించగా, 246 మంది తీవ్ర గాయాల పాలయ్యారు. ఆ తర్వాత సూరత్‌లో పేలని బాంబులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సులో మొత్తం 78 మందిపై విచారణ జరగగా, 2022లో ప్రత్యేక కోర్టు 49 మందిని దోషులుగా తేల్చి, 28 మందిని నిర్దోషులుగా విడుదల చేసింది. ఉరిశిక్ష అమలుకు హైకోర్టు ధ్రువీకరణ తప్పనిసరి కావడంతో రాష్ట్ర ప్రభుత్వం శిక్షల నిర్ధారణ కోసం హైకోర్టును ఆశ్రయించింది. జస్టిస్ అల్పేష్ కొగ్జే, జస్టిస్ సవూర్ దవేలతో డిన గుజరాత్ హైకోర్టు ధర్మాసనం గత రెండున్నరేళ్లుగా దాదాపు 248 సార్లు అప్పీళ్లపై విచారణ జరిపి మంగళవారం తుది తీర్పు వెల్లడించింది. . 38 మందికి మరణశిక్ష, 11 మందికి జీవితఖైదు విధిస్తూ 2022లో ప్రత్యేక న్యాయస్థానం ఇచ్చిన తీర్పును సమర్థించింది. కిందికోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను కొట్టివేసింది. ఈ పేలుళ్లలో మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు, గాయపడినవారికి రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని గుజరాత్ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. మార్చి 31, 2027లోగా పరిహార చెల్లింపులు పూర్తి చేయాలని పేర్కొంది. నిషేధిత ఇండియన్ ముజాహిదీన్, సిమి ఉగ్రవాద సంస్థల కుట్రను ప్రాసిక్యూషన్ నిరూపించగలిగింది. దేశద్రోహం, హత్య నేరాలతో పాటు కఠినమైన ఉగ్రవాద నిరోధక చట్టం 'ఉపా' కింద దోషులుగా న్యాయస్థానం తేల్చింది. కాగా, దేశ చరిత్రలోనే ఒ సులో ఇంతపెద్ద సంఖ్యలో 38 మందికి ఉరిశిక్షలు ఖరారు కావడం ఇదే ప్రథమం.2008 జులై 26న అహ్మదాబాద్‌లో 21 చోట్ల జరిగిన వరుస పేలుళ్లలో 56 మంది ప్రాణాలు కోల్పోయారు. 246 మంది గాయపడ్డారు. నగరవ్యాప్తంగా ఆసుపత్రులు సహా పలుచోట్ల పేలుళ్లు జరగ్గా రెండ్రోజుల తర్వాత సూరత్ లోనూ బాంబులు గుర్తించారు. ఇక పేలుళ్ల శబ్దాలకు సవూపంలో ఉన్నవారు కొంతకాలం వినికిడి శక్తి కోల్పోయారు. దర్యాప్తులో భాగంగా అహ్మదా బాద్ నగర నేరవిభాగం 100 మందిని నిందితులుగా పేర్కొంది. 78 మందిపై విచారణ చేపట్టింది. 2022లో ప్రత్యేక న్యాయస్థానం ఇచ్చిన తీర్పులో 49 మందిని దోషులుగా నిర్ధరించింది. 28 మందిని నిర్దోషులుగా విడుదల చేసింది. అప్రూవర్‌గా మారిన ఒక నిందితుడికి క్షమాభిక్ష ప్రసాదించింది. తొలుత ఇచ్చిన వాంగ్మూలాలు ఉపసంహరించుకున్న మరో నలుగురు అప్రూవర్ల కు శిక్ష విధించింది. 2002లో జరిగిన గోధ్రా అనంతర అల్లర్లకు ప్రతీకారంగానే ఈ దాడులు జరిపినట్లు నాడు వార్తలు వచ్చాయి. తర్వాత ఇండియన్ ముజాహిదీన్ బాధ్యత ప్రకటించుకుంది. ఈ సు విచారణ సమయంలో నాటకీయ పరిణామా లు చోటుచేసుకున్నాయి. 24 మంది నిందితులు టన్నెల్ తవ్వి జైలు నుంచి తప్పించుకునేందుకు యత్నించారు. అయితే ఆ కుట్రను పోలీసులు భగ్నం చేశారు.

## పిల్లల లైంగిక దోపిడీపై కఠిన చర్యలు

- ప్రభుత్వ నోటీసు నేపథ్యంలో మెటా వివరణాత్మక బ్లాగ్
- ఏఐతో కోట్లాది కంటెంట్, లక్షల ఖాతాలపై చర్యలు
- అభ్యంతరకర ప్రకటనలు, ఖాతాలు ఇప్పటికే తొలగించామని వెల్లడి

**న్యూఢిల్లీ:** పిల్లల లైంగిక దోపిడీ అత్యంత ఘోరమైన నేరమని, అలాంటి కంటెంట్‌పై తమ వేదికల్లోనే కాకుండా వాటి వెలుపల కూడా నిరంతరం పోరాడుతున్నామని మెటా ప్రకటించింది. ఇన్‌స్టాగ్రామ్ లో పిల్లల లైంగిక దోపిడీకి సంబంధించిన ప్రకటనలపై కేంద్ర ప్రభుత్వం నోటీసు జారీ చేయడంతో సంస్థ వివరణాత్మక బ్లాగ్ విడుదల చేసింది. అధికారుల దృష్టికి రాకముందే నిబంధనలకు విరుద్ధమైన కొన్ని ప్రకటనలు, వాటి వెనుక ఉన్న ఖాతాలను గుర్తించి తొలగించామని, అనంతరం మరిన్ని ప్రకటనలు, ఖాతాలు, వెబ్ లింకులపై కూడా చర్యలు తీసుకున్న ట్లు తెలిపింది. గత ఏడాది ప్రపంచవ్యాప్తంగా 3.6 కోట్లకు పైగా అభ్యంతరకర కంటెంట్, 40 లక్షలకు పైగా అనుమానాస్పద ఖాతాలను తొలగించామని, గత ఆరు నెలల్లో భారత్‌లోనే 1.6 లక్షల ఖాతాలపై చర్యలు తీసుకున్నట్లు పేర్కొంది. బీబీసీ కథనం నేపథ్యంలో కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ మెటాకు నోటీసు జారీ చేసి, అభ్యంతరకర కంటెంట్‌ను వెంటనే తొలగించి ఏడు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించింది.

## మౌలిక వసతుల రుణాలకు ప్రాధాన్య రంగ హోదా ఇవ్వాలి

- పీఎస్ఎల్ మార్గదర్శకాల సమీక్షకు ఎస్‌బీఐ ఆర్థికవేత్తల సూచన
- 2047 అభివృద్ధి లక్ష్యాలకు భారీ పెట్టుబడులే కీలకమని వ్యాఖ్య
- గృహ, విద్య, పునరుత్పాదక ఇంధన రుణ పరిమితుల పెంపునకు ప్రతిపాదన

**ముంబై:** దేశంలో ప్రాధాన్య రంగ రుణాల (పీఎస్ఎల్) మార్గదర్శకాలను సమగ్రంగా పునఃసమీక్షించాలని, ముఖ్యంగా మౌలిక వసతుల (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) రుణాలను ప్రాధాన్య రంగంలో చేర్చాలని దేశంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు ఎస్‌బీఐ ఆర్థికవేత్తలు సూచించారు. దేశాభివృద్ధి లక్ష్యాలను సాధించాలంటే బ్యాంకుల ద్వారా మౌలిక వసతుల రంగానికి మరింత రుణ ప్రవాహం అవసరమని పేర్కొన్నారు. ప్రధానమంత్రి 2047 అభివృద్ధి దృష్టికోణాన్ని సాకారం చేయాలంటే మౌలిక వసతుల రంగంలో భారీ పెట్టుబడులు అవసరమని ఎస్‌బీఐ అధ్యయన పత్రం పేర్కొంది. దేశంలో బాండ్ మార్కెట్ ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందకపోవడంతో దీర్ఘకాలిక నిధుల లభ్యత పరిమితంగా ఉందని, అందువల్ల అన్ని మౌలిక వసతుల రుణాలకు ప్రాధాన్య రంగ హోదా కల్పించడం లేదా పీఎస్ఎల్ లక్ష్యాల గణన నుంచి వాటిని మినహాయించడం పరిశీలించాలని సూచించింది.

### పీఎస్ఎల్ విధానంలో మార్పుల ప్రతిపాదన

2024–25 ఆర్థిక సంవత్సరంలో ప్రాధాన్య రంగ రుణ ధ్రువపత్రాల (పీఎస్ఎల్‌సీ) లావాదేవీలు రూ.12.2 లక్షల కోట్లకు చేరగా, 2017–18లో అవి రూ.1.8 లక్షల కోట్లుగా ఉన్నాయని అధ్యయనం వెల్లడించింది. పీఎస్ఎల్‌సీలు కొనుగోలు చేయడం లేదా గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి నిధి (ఆర్ఐడీఎఫ్)లో నిధులు జమ చేయడం మినహా, ఏ బ్యాంకు కూడా 40 శాతం ప్రాధాన్య రంగ రుణాల లక్ష్యాన్ని చేరుకోవడం లేదని పేర్కొంది. మెట్రో నగరాల్లో ప్రాధాన్య రంగ గృహ రుణాల పరిమితిని రూ.1 కోట్లకు, ఇతర ప్రాంతాల్లో రూ.75 లక్షలకు పెంచాలని ఎస్‌బీఐ సూచించింది. విద్యా వ్యయం పెరుగుతున్న నేపథ్యంలో విద్యా రుణాల పరిమితిని రూ.25 లక్షల నుంచి రూ.50 లక్షలకు పెంచాలని ప్రతిపాదించింది. అలాగే పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు ప్రాధాన్య రంగ హోదా పొందే రుణ పరిమితిని రూ.35 కోట్ల నుంచి రూ.100 కోట్లకు, వ్యక్తిగత రూఫ్‌టాప్ సోలార్ రుణ పరిమితిని రూ.10 లక్షల నుంచి రూ.2 కోట్లకు పెంచాలని సిఫారసు చేసింది.







# తృణమూల్ ఖాతాల నిధులపై ఈడీ దాడులు

- కోల్‌కతాలో ఐదు ప్రాంతాల్లో సోదాలు
- విమానం, హెలికాప్టర్ కొనుగోలుకు పార్టీ ఖాతాల నుంచి నిధుల మళ్లింపుపై దర్యాప్తు
- రూ.160 కోట్ల లావాదేవీలపై ఈడీ అనుమానాలు

కోల్‌కతా/న్యూఢిల్లీ: తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) బ్యాంకు ఖాతాల నుంచి నిధులను మళ్లించి ప్రైవేట్ జెట్, హెలికాప్టర్ కొనుగోలు చేసినట్లు ఆరోపణలు రావడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మంగళవారం కోల్‌కతాలో ఐదు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించింది. కేర్‌వెల్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్, దాని అనుబంధ సంస్థ కేర్‌వెల్ ఏవియేషన్ కార్యాలయాలు కూడా సోదాల పరిధిలోకి వచ్చాయి. ప్రాథమిక దర్యాప్తులో 2023 ఏప్రిల్ నుంచి 2026 జూన్ వరకు టీఎంసీ బ్యాంకు ఖాతాల నుంచి కేర్‌వెల్ ఏవియేషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, దాని అనుబంధ సంస్థలకు సుమారు రూ.160 కోట్లు బదిలీ అయినట్లు ఈడీ గుర్తించినట్లు అధికారులు తెలిపారు. అనంతరం రూ.82.96 కోట్లు మరో కొత్త సంస్థకు మళ్లించగా, అందులో రూ.112 కోట్లతో ఎంబ్రాయర్ లెగసీ–600 బిజినెస్ జెట్, అగస్టా వెస్ట్‌ల్యాండ్ 109ఎస్‌పీ హెలికాప్టర్ కొనుగోలు చేసినట్లు ఆరోపించారు. హెలికాప్టర్ కొనుగోలులో విదేశీ నిధులు కూడా వినియోగించినట్లు ఈడీ అనుమానిస్తోంది.

### లావాదేవీలపై దర్యాప్తు

కొనుగోలు చేసిన విమానం, హెలికాప్టర్‌ను టీఎంసీకే అద్దెకు ఇచ్చినట్లు, అనంతరం విమాన వినియోగం పేరిట భారీ మొత్తాలు చెల్లించినట్లు ఈడీ పేర్కొంది. ఈ మొత్తం లావాదేవీల వెనుక అసలు ఉద్దేశాన్ని దాచిపెట్టే ప్రయత్నం జరిగినట్లు అనుమానిస్తున్నట్లు వెల్లడించింది.గత నెలలో తిరుగుబాటు ఎమ్మెల్యేల ఫిర్యాదుల నేపథ్యంలో టీఎంసీకి చెందిన మూడు బ్యాంకు ఖాతాల నుంచి డెబిట్ లావాదేవీలను కోల్‌కతా పోలీసులు నిలిపివేశారు. ఆ ఖాతాల్లో సుమారు రూ.440 కోట్లు ఉన్నట్లు అంచనా. ఈ ఖాతాల వివరాలను వెల్లడించాలని ఇటీవల కలకత్తా హైకోర్టు బ్యాంకును ఆదేశించింది. ఇదిలా ఉండగా, పార్టీ ఫిరాయింపుల వ్యవహారంపై లోక్‌సభ స్పీకర్ త్వరలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం.

## ప్రధాని మోదీకి ఇండోనేషియా అత్యున్నత పురస్కారం

- 'బింటాంగ్ ఆదిపూర్ణ రిపబ్లిక్ ఆఫ్ ఇండోనేషియా' అవార్డు ప్రకటించిన ఇండోనేషియా ప్రభుత్వం
- ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంలో కృషికి గుర్తింపు

**న్యూఢిల్లీ:** భారత ప్రధాని నరేంద్ర మోదీకి అంతర్జాతీయ వేదికపై మరో అరుదైన గౌరవం దక్కింది. ఇండోనేషియా ప్రభుత్వం తమ అత్యున్నత పౌర పురస్కారమైన **'బింటాంగ్ ఆదిపూర్ణ రిపబ్లిక్ ఆఫ్ ఇండోనేషియా' అవార్డును ప్రధాని మోదీకి ప్రకటించింది. భారత్–ఇండోనేషియా మధ్య దౌత్య, ఆర్థిక, వ్యూహాత్మక, ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి ప్రధాని మోదీ అందించిన విశేష సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారాన్ని ప్రకటించినట్లు ఇండోనేషియా ప్రభుత్వం వెల్లడించింది. ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో అధికారికంగా ఈ పురస్కారాన్ని ప్రకటిస్తూ, ఇరు దేశాల మధ్య చారిత్రక బంధాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లడంలో ప్రధాని మోదీ కీలక పాత్ర పోషించారని ప్రశంసించారు. అలాగే అభివృద్ధి చెందుతున్న దేశాల సమూహమైన గ్లోబల్ సౌత్ ప్రయోజనాల పరిరక్షణతో పాటు ఆసియా–పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం, భద్రత కోసం భారత్ అందిస్తున్న సహకారం విశేషమని కొనియాడారు.



# చరిత్ర సృష్టించిన కోకో గాఫ్

- వింబుల్డన్‌లో తొలిసారి సెమీఫైనల్‌లోకి అమెరికా స్టార్
- పెగులాపై 4-6, 6-3, 6-3 తేడాతో అద్భుత విజయం



**లండన్:** అమెరికా స్టార్ టెన్నిస్ క్రీడాకారిణి కోకో గాఫ్ వింబుల్డన్‌లో తొలిసారి సెమీఫైనల్‌కు చేరి చరిత్ర సృష్టించింది. మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో తోటి అమెరికన్ జెస్సికా పెగులాను 4-6, 6-3, 6-3తో ఓడించి చివరి నాలుగులో స్థానం దక్కించుకుంది. మొదటి సెట్‌ను కోల్పోయిన గాఫ్, ఆ తర్వాత అసాధారణ ఆటతీరుతో వరుసగా రెండో, మూడో సెట్లను కైవసం చేసుకుని మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. తొలి మ్యాచ్ పాయింట్‌లో పెగులా కొట్టిన బ్యాక్‌హ్యాండ్ నెట్‌లో పడటంతో గాఫ్ విజయాన్ని ఖరారు చేసింది. 22 ఏళ్ల గాఫ్ ఈ విజయంతో నాలుగు గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లోనూ సెమీఫైనల్‌కు చేరిన అత్యంత పిన్న వయస్కురాలిగా 2007 ఫ్రెంచ్ ఓపెన్‌లో ఈ ఘనత సాధించిన మరియా షరపోవా తర్వాత నిలిచింది. వింబుల్డన్‌లో గత ఆరు ప్రయత్నాల్లో నాలుగో రౌండ్ దాటలేకపోయిన గాఫ్, ఈసారి తొలిసారి సెమీస్‌కు చేరడం విశేషం. ఫైనల్‌లో చోటు కోసం గాఫ్ సెమీఫైనల్లో నవోమి ఒసాకా-కరోలినా ముచోవా మ్యాచ్ విజేతతో తలపడనుంది. మరో క్వార్టర్‌ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ జానిక్ సిన్నర్, జాన్-లెనార్డ్ స్ట్రఫ్‌తో తలపడుతున్నాడు. ఇదిలా ఉంటే వింబుల్డన్‌లో ఉష్ణోగ్రత 29 నుంచి 31 డిగ్రీల సెల్సియస్‌కు చేరడంతో ఆటగాళ్లు తీవ్ర ఎండను ఎదుర్కొన్నారు. గాఫ్ మ్యాచ్ మధ్యలో ఐస్ ప్యాక్ కోరగా, సిన్నర్ విరామ సమయంలో మెడకు ఐస్ టవల్ వేసుకుని ఉపశమనం పొందాడు.

### ముగిసిన ఒసాకా పోరాటం

నాలుగుసార్లు గ్రాండ్‌స్లామ్ విజేత, మాజీ ప్రపంచ నంబర్‌వన్ నవోమీ ఒసాకా వింబుల్డన్ ప్రయాణం క్వార్టర్‌ఫైనల్లో ముగిసింది.





మంగళవారం జరిగిన మ్యాచ్‌లో చెక్ రిపబ్లిక్‌కు చెందిన కరోలినా ముచోవా చేతిలో 7-6(4), 6-4తో పరాజయం పాలైంది. దీంతో తొలిసారి వింబుల్డన్ క్వార్టర్స్ చేరిన ఒసాకా ముందడుగు అక్కడితో ఆగిపోయింది. నాలుగో రౌండ్‌లో ప్రపంచ నంబర్‌వన్ అరినా సబలెంకాను సంచలనంగా ఓడించిన ఒసాకా, క్వార్టర్స్‌లో మాత్రం తన ఆటతీరును కొనసాగించలేకపోయింది. గత మ్యాచ్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచినా, ఈ మ్యాచ్‌లో శక్తి లేకపోవడంతో పాటు తన సహజ లయను అందుకోలేకపోయానని తెలిపింది. గ్రాండ్‌స్లామ్‌కు ముందు వరుసగా రెండు వారాలు విశ్రాంతి లేకుండా ఎక్కువ మ్యాచ్‌లు ఆడటమే ఇందుకు కారణమని పేర్కొంది. తనకు చీలమండ సమస్య కాదని, పాదాల్లో ప్లాంటర్ ఫాసియాటిస్ సమస్య వేధిస్తోందని ఒసాకా వెల్లడించింది. గతేడాది ఆఫ్ సీజన్‌లో ప్రారంభమైన ఈ సమస్య గడ్డి కోర్టుల్లో మరింత ఎక్కువైందని తెలిపింది. హార్డ్‌కోర్టుల్లో మాత్రం ఇబ్బంది ఉండకపోవచ్చని ఆశాభావం వ్యక్తం చేసింది. మాతృత్వ విరామం తర్వాత మళ్లీ ఫామ్‌లోకి వస్తున్న ఒసాకా, అమెరికా ఓపెన్‌లో తనకు మంచి అవకాశాలు ఉన్నాయని విశ్వాసం వ్యక్తం చేసింది.

**ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో** అర్జెంటీనా కెప్టెన్ లియోనెల్ మెస్సీ మరోసారి తన అసాధారణ ప్రతిభతో జట్టును విజయతీరాలకు చేర్చాడు. మంగళవారం జరిగిన ప్రీక్వార్టర్ మ్యాచ్‌లో ఈజిప్టుపై 3-2తో నాటకీయ విజయాన్ని నమోదు చేసిన అర్జెంటీనా క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకెళ్లింది. మ్యాచ్ చివరి 11 నిమిషాల్లోనే మూడు గోల్స్ సాధించి అద్భుత పునరాగమనం చేసింది. 79వ నిమిషంలో క్రిస్టియన్ రొమెరో చేసిన హెడ్డర్‌కు మెస్సీ అద్భుత అసిస్ట్ అందించాడు. అనంతరం 83వ నిమిషంలో స్వయంగా గోల్ సాధించి స్కోరును 2-2తో సమం చేశాడు. చివరి క్షణాల్లో అర్జెంటీనా విజేత గోల్‌తో మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. మెర్సిడెస్-బెంజ్ స్టేడియంలో వేలాది అర్జెంటీనా అభిమానులు సంబరాల్లో మునిగిపోయారు. ఈ ప్రపంచకప్‌లో మెస్సీకి ఇది ఎనిమిదో గోల్. దీంతో గోల్డెన్ బూట్ పోటీలో అతడు అగ్రస్థానానికి చేరుకున్నాడు. ఫ్రాన్స్ స్టార్ కిలియన్ ఎంబాప్పే, నార్వే స్ట్రైకర్ ఎర్లింగ్ హాలాండ్ చెరో ఏడు గోల్స్‌తో రెండో స్థానంలో ఉన్నారు. ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ కేన్ ఆరు గోల్స్‌తో పోటీలో కొనసాగుతున్నాడు. 2022 ప్రపంచకప్ నుంచి వరుసగా తొమ్మిది ప్రపంచకప్ మ్యాచ్‌ల్లో గోల్ చేసిన తొలి ఆటగాడిగా మెస్సీ అరుదైన రికార్డు నెలకొల్పాడు. ఈ తొమ్మిది మ్యాచ్‌ల్లో అతడు మొత్తం 13 గోల్స్ నమోదు చేశాడు.



అఫ్గానిస్థాన్ మాజీ పేసర్ షపూర్ జద్రాన్ (38) మంగళవారం కన్నుమూశారు. అరుదైన, ప్రాణాంతకమైన హీమోఫాగోసిటిక్ లింఫోహిస్టియోసైటోసిస్ (హెచ్‌ఎల్‌హెచ్) అనే వ్యాధితో కొంతకాలంగా చికిత్స పొందుతున్న ఆయన ఢిల్లీలో తుదిశ్వాస విడిచారు. ఆయన మరణ వార్తను అఫ్గానిస్థాన్ క్రికెట్ బోర్డు (ఏసీబీ) అధికారికంగా ప్రకటించింది. 2009 నుంచి 2020 వరకు అఫ్గానిస్థాన్ తరఫున ఆడిన ఎడమచేతి ఫాస్ట్ బౌలర్ జద్రాన్ 44 వన్డేలు, 36 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడాడు. అఫ్గానిస్థాన్ క్రికెట్ అంతర్జాతీయ స్థాయికి చేరుకోవడంలో కీలక పాత్ర పోషించిన ఆటగాళ్లలో ఆయన ఒకరని ఏసీబీ కొనియాడింది. దేశ క్రికెట్ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొంది. జద్రాన్ 2015 వన్డే ప్రపంచకప్‌లో అఫ్గానిస్థాన్ తరఫున అత్యధికంగా 10 వికెట్లు తీసిన బౌలర్‌గా జద్రాన్ నిలిచాడు.





# భారత్‌కు ఘోర పరాభవం

- మూడో టీ20లో 76 పరుగులకే ఆలౌట్
- పెవిలియన్‌కు పోటీపడి క్యూ కట్టిన బ్యాట్స్‌మెన్లు
- 125 పరుగుల భారీ తేడాతో ఇంగ్లండ్ ఘన విజయం
- ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 2-0తో ఆతిథ్య జట్టు

నాటింగ్‌హామ్: మూడో టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లో భారత జట్టు ఘోర పరాభవాన్ని చవిచూసింది. 202 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ కేవలం 76 పరుగులకే ఆలౌటై 125 పరుగుల భారీ తేడాతో ఓడిపోయింది. టీ20 చరిత్రలో పరుగుల పరంగా భారత్‌కు ఇదే అతిపెద్ద ఓటమి. తొలి మ్యాచ్ వర్షంతో రద్దు కాగా, వరుసగా రెండు మ్యాచ్‌లు గెలిచిన ఇంగ్లండ్ ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 2-0తో ఆధిక్యంలో నిలిచింది. జోఫ్రా ఆర్చర్ (3/29), జోష్ టంగ్ (4/28) భారత టాప్‌ఆర్డర్‌ను చిత్తు చేశారు. పవర్‌ప్లేలోనే భారత్ 52 పరుగులకు ఐదు వికెట్లు కోల్పోయి కోలుకోలేని స్థితిలో పడింది. భారత బ్యాటర్లలో నలుగురు మాత్రమే రెండంకెల స్కోరు నమోదు చేయగా, వైభవ్ సూర్యవంశీ 13 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్, అక్షర్ పటేల్ తదితరులు నిరాశపరిచారు.

### సాల్ట్, కరన్ మెరుపులు

అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 201 పరుగులు చేసింది. ఓపెనర్ ఫిల్ సాల్ట్ 44 బంతుల్లో 70 పరుగులతో ఇన్నింగ్స్‌కు బలమైన పునాది వేశాడు. చివర్లో సామ్ కరన్ 24 బంతుల్లో అజేయంగా 41 పరుగులు చేసి జట్టును 200 పరుగుల మార్క్ దాటించాడు. భారత బౌలర్లలో హర్షిత్ రాణా (2/40), ప్రిన్స్ యాదవ్ (2/30) రెండేసి వికెట్లు తీసి ఆకట్టుకున్నారు. అయితే స్పిన్నర్లు అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి భారీగా పరుగులు సమర్పించుకోవడంతో ఇంగ్లండ్ భారీ స్కోరు నమోదు చేసింది. ఈ ఓటమితో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలోని భారత్‌పై సిరీస్‌ను నిలబెట్టుకోవాలంటే మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో తప్పక గెలవాల్సిన పరిస్థితి ఏర్పడింది. బ్యాటింగ్‌లో పేలవ ప్రదర్శన జట్టు యాజమాన్యాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.

# మారుతి సుజుకీకి రూ.9 కోట్ల కస్టమ్స్ నోటీస్

- దిగుమతి సుంకాల వ్యత్యాసంపై మహారాష్ట్ర కస్టమ్స్ చర్య
- సుంకం, జరిమానా కలిపి రూ.9.47 కోట్ల డిమాండ్
- నోటీసును సవాల్ చేస్తామని కంపెనీ వెల్లడి

MARUTI SUZUKI

న్యూఢిల్లీ: దేశీయ కార్ల తయారీ దిగ్గజం మారుతి సుజుకీ ఇండియా లిమిటెడ్‌కు దిగుమతి చేసిన వస్తువులపై వేర్వేరు సుంకాల చెల్లింపుకు సంబంధించిన అంశంలో మహారాష్ట్ర కస్టమ్స్ శాఖ రూ.9 కోట్లకు పైగా డిమాండ్ నోటీసు జారీ చేసింది. మహారాష్ట్రలోని జవహర్‌లాల్ నెహ్రూ కస్టమ్స్ హౌస్ (జేఎన్‌సీహెచ్) కమిషనర్ కార్యాలయం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, దిగుమతి సుంకంలో తేడాగా రూ.4,73,94,938 చెల్లించాలని ఆదేశించింది. అదే మొత్తాన్ని జరిమానాగా విధించడంతో పాటు, వర్తించే వడ్డీని కూడా చెల్లించాలని పేర్కొంది. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తామని మారుతి సుజుకీ స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఇచ్చిన సమాచారం ద్వారా వెల్లడించింది. ఈ నోటీస్‌తో కంపెనీ ఆర్థిక పరిస్థితి, కార్యకలాపాలు లేదా వ్యాపారంపై ఎలాంటి గణనీయమైన ప్రభావం ఉండదని స్పష్టం చేసింది.

# రూ.25వేల కోట్ల ఓవర్‌నైట్ రెపో వేలం నేడు

- ద్రవ్య లభ్యత సమీక్ష అనంతరం ఆర్‌బీఐ నిర్ణయం
- బ్యాంకింగ్ వ్యవస్థలో రూ.1.19 లక్షల కోట్ల అదనపు లిక్విడిటీ

ముంబై: బ్యాంకింగ్ వ్యవస్థలో ప్రస్తుత ద్రవ్య లభ్యత పరిస్థితులను సమీక్షించిన అనంతరం భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) బుధవారం (జులై 8) రూ.25,000 కోట్ల విలువైన ఓవర్‌నైట్ వేరియబుల్ రేట్ రెపో (వీఆర్‌ఆర్) వేలాన్ని నిర్వహించనున్నట్లు ప్రకటించింది. వీఆర్‌ఆర్ వేలం బుధవారం ఉదయం 9.30 గంటల నుంచి 10 గంటల వరకు జరుగుతుంది. వేలం ద్వారా అందించే నిధులను జులై 9న ఆర్‌బీఐ తిరిగి స్వీకరించనుంది. జులై 6 నాటికి బ్యాంకింగ్ వ్యవస్థలో సుమారు రూ.1.19 లక్షల కోట్ల అదనపు ద్రవ్య లభ్యత ఉన్నట్లు ఆర్‌బీఐ వెల్లడించింది. జులై 7న నిర్వహించిన రూ.50వేల కోట్ల ఓవర్‌నైట్ వీఆర్‌ఆర్ వేలానికి కేవలం రూ.1,135 కోట్ల బిడ్లు మాత్రమే వచ్చాయి. బ్యాంకింగ్ వ్యవస్థలో ఇప్పటికే సమృద్ధిగా ద్రవ్య లభ్యత ఉండటమే ఇందుకు కారణమని నిపుణులు పేర్కొన్నారు. ఆ బిడ్లన్నింటినీ ఆర్‌బీఐ 5.26 శాతం కట్‌ఆఫ్, వెయిటెడ్ సగటు వడ్డీ రేటుతో ఆమోదించింది. జూన్ నెల నుంచి ఇప్పటివరకు వివిధ ఓవర్‌నైట్, ఏడు రోజుల వీఆర్‌ఆర్ వేలాల ద్వారా బ్యాంకింగ్ వ్యవస్థలో రూ.6 లక్షల కోట్లకు పైగా తాత్కాలిక ద్రవ్య లభ్యతను ఆర్‌బీఐ అందించింది.



# స్టాక్ మార్కెట్ల జోరుకు బ్రేక్

## నాలుగు రోజుల ర్యాలీకి తెరదించిన సెన్సెక్స్, నిఫ్టీ

- 12% పైగా కుప్పకూలిన ట్రెంట్ షేరు
- ఐటీ షేర్ల ర్యాలీతో నష్టాలు కొంతవరకు పరిమితం

**ముంబై:** వరుసగా నాలుగు రోజుల లాభాల అనంతరం దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం లాభాల స్వీకరణ ఒత్తిడితో స్వల్ప నష్టాల్లో ముగిశాయి. ఆసియా మార్కెట్ల బలహీన ధోరణి, హోర్ముజ్ జలసంధిలో చమురు నౌకపై దాడి నేపథ్యంలో పెట్టుబడిదారులు అప్రమత్తంగా వ్యవహరించడంతో సూచీలు చివరి గంటలో ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 104.35 పాయింట్లు (0.13%) క్షీణించి 78,180.72 వద్ద ముగిసింది. రోజంతా గరిష్ఠంగా 379.85 పాయింట్లు లాభపడినా చివరికి నష్టాల్లోకి జారుకుంది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 31.65 పాయింట్లు (0.13%) తగ్గి 24,398.70 వద్ద స్థిరపడింది. జూన్ త్రైమాసిక ఆదాయ వృద్ధి మార్కెట్ అంచనాలను అందుకోకపోవడంతో ట్రెంట్ షేరు 12.42 శాతం పతనమై సెన్సెక్స్‌లో అత్యధిక నష్టపోయిన షేరుగా నిలిచింది. అదానీ పోర్ట్స్, భారత్ ఎలక్ట్రానిక్స్, లార్సన్ అండ్ టూబ్రో, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీ ఐసీఐ బ్యాంక్ షేర్లు కూడా నష్టపోయాయి. మరోవైపు, జూన్ త్రైమాసిక ఫలితాలకు ముందు హెచ్‌సీఎల్ టెక్ 3.08 శాతం ఎగ సింది. టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, టీసీఎస్ షేర్లు కూడా లాభపడ్డాయి. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) గురువారం త్రైమాసిక ఫలితాలను ప్రకటించనుండటంతో ఐటీ రంగంలో కొనుగోళ్లు పెరిగాయి. జూ న్ త్రైమాసికంలో 41శాతం ఆదాయ వృద్ధిని నమోదు చేసినట్లు ప్రకటించడంతో టైటాన్ షేరు 2.62 శాతం ఎగసింది. ఎటర్న ల్ షేరు కూడా 2.12 శాతం లాభపడింది.

### ఆసియా మార్కెట్ల ప్రభావం

బీఎస్ఈలో 2,633 షేర్లు నష్టాల్లో ముగియగా, 1,599 షేర్లు లాభపడ్డాయి. దక్షిణ కొరియా, జపాన్, చైనా, హాంకాంగ్ మార్కెట్లు బలహీనంగా ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ ముడి చమురు ధర బ్యారెల్‌కు 72.87 డాలర్లకు చేరింది. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు (ఎఫ్ఐఐలు) సోమవారం రూ.243.03 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేసినట్లు స్టాక్ ఎక్స్ఛేంజ్ గణాంకాలు వెల్లడించాయి.



Business
బిజినెస్

# ప్రీమియం బైక్‌ల విభాగంలో టీవీఎస్ దూకుడు

- మూడేళ్లలో 29శాతం మార్కెట్ వాటా వృద్ధి నమోదు
- పరిశ్రమ వృద్ధి 11.6 శాతంతో పోలిస్తే రెట్టింపు పనితీరు
- జోరుగా ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల అమ్మకాలు

**ముంబై:** ప్రీమియం, సూపర్ ప్రీమియం ద్విచక్ర వాహనాల విభాగంలో టీవీఎస్ మోటార్ కంపెనీ పరిశ్రమ కంటే మెరుగైన వృద్ధిని నమోదు చేస్తోందని సంస్థ ఇండియా టూ-వీలర్ బిజినెస్ అధ్యక్షుడు గౌరవ్ గుప్తా తెలిపారు. గత మూడేళ్లలో ఈ విభాగంలో టీవీఎస్ సగటున 29 శాతం మార్కెట్ వాటా వృద్ధిని నమోదు చేయగా, పరిశ్రమ వృద్ధి 11.6 శాతానికే పరిమితమైందన్నారు. వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా కొత్త ఉత్పత్తుల అభివృద్ధి, డీలర్ నెట్‌వర్క్ విస్తరణ ద్వారా ఈ వృద్ధిని మరింత కొనసాగిస్తామని గౌరవ్ గుప్తా తెలిపారు. దేశంలో ప్రీమియం ద్విచక్ర వాహనాల మార్కెట్ వేగంగా విస్తరిస్తోందని, అదే దిశగా కంపెనీ ముందుకు సాగుతుందని చెప్పారు. ఫాడా గణాంకాల ప్రకారం జూన్‌లో దేశీయంగా ద్విచక్ర వాహనాల రిటైల్ అమ్మకాలు 21.22 శాతం పెరిగి 18.28 లక్షల యూనిట్లకు చేరాయి. అదే నెలలో టీవీఎస్ మొత్తం ద్విచక్ర వాహనాల అమ్మకాలు 47 శాతం పెరిగి 5.65 లక్షల యూనిట్లకు చేరగా, దేశీయ అమ్మకాలు 46 శాతం వృద్ధితో 4.11 లక్షల యూనిట్లుగా నమోదయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో కంపెనీ మొత్తం అమ్మకాలు 27 శాతం పెరిగి 15.64 లక్షల యూనిట్లకు



చేరుకున్నాయి.

### ఈవీ విభాగంలోనూ వృద్ధి

దేశంలో ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల వినియోగం వేగంగా పెరుగుతోందని, విస్తృతమైన మోడళ్లు, ఛార్జింగ్ మౌలిక వసతుల మెరుగుదల దీనికి కారణమని గౌరవ్ గుప్తా పేర్కొన్నారు. జూన్‌లో దేశవ్యాప్తంగా ఈవీ ద్విచక్ర వాహనాల అమ్మకాలు 74.98 శాతం పెరిగి 1.93 లక్షల యూనిట్లకు చేరగా, టీవీఎస్ ఈవీ అమ్మకాలు 76.05 శాతం వృద్ధితో 47,064 యూనిట్లుగా నమోదయ్యాయి.



# విమాన ఇంధనాన్ని జీఎస్‌టీ పరిధిలోకి తేవాలి

- కేంద్రానికి ఎయిర్‌లైన్స్ సమాఖ్య విజ్ఞప్తి

**ముంబై:** విమాన ఇంధనం (ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్-ఏటీఎఫ్)ను వస్తు సేవల పన్ను (జీఎస్టీ) పరిధిలోకి తీసుకురావాలని ఎయిర్ ఇండియా, ఇండిగో, స్పైస్‌జెట్ సంస్థల సమాఖ్య అయిన ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎయిర్‌లైన్స్ (ఎఫ్ఐఏ) కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ చర్యతో ఎయిర్‌లైన్స్ నిర్వహణ వ్యయాలు గణనీయంగా తగ్గుతాయని పేర్కొంది. పశ్చిమాసియా ఉద్రిక్తతలు, గగనతల పరిమితులు, రూపాయి విలువ క్షీణత వంటి కారణాలతో విమానయాన రంగం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోందని ఎఫ్ఐఏ తెలిపింది. గతంలో మొత్తం నిర్వహణ వ్యయంలో 30-40 శాతం ఉన్న ఇంధన వ్యయం ప్రస్తుతం 55-60 శాతానికి చేరి సంస్థలపై భారీ భారం పడుతోందని పేర్కొంది.

### 5శాతం జీఎస్‌టీ కోరిన ఎఫ్ఐఏ

పాలిమర్లు, పెట్రోకెమికల్స్, ఇంజినీరింగ్ సామగ్రి, విమానాశ్రయ సేవలు, లాజిస్టిక్స్ తదితర ఖర్చులు కూడా పెరిగాయని తెలిపిన ఎఫ్ఐఏ, ఏటీఎఫ్‌ను 5 శాతం జీఎస్‌టీ పరిధిలోకి తీసుకువచ్చి పూర్తి ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) కల్పించాలని కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖను కోరింది. ప్రస్తుతం ఏటీఎఫ్‌పై రాష్ట్ర ప్రభుత్వాలు ఎక్సైజ్ సుంకం, వ్యాట్ విధిస్తున్నాయి.



## వైవిధ్యమైన పాత్రలే లక్ష్యం

'మిరాయ్' చిత్రంతో టాలీవుడ్ ప్రేక్షకులకు మరింత చేరువైన యువ నటి రితికా నాయక్ తన భవిష్యత్ సినీ ప్రయాణంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె, ఇకపై కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా నటిగా తన ప్రతిభను నిరూపించుకునే అవకాశం ఉన్న గ్రే షేడ్ పాత్రల్లో నటించాలని ఆకాంక్ష వ్యక్తం చేసింది. అలాగే మహిళా ప్రాధాన్యత కలిగిన కథల్లో ప్రధాన పాత్రలు పోషించడం తన లక్ష్యమని వెల్లడించింది. ఇటీవల ఓ భారీ ప్రాజెక్ట్ నుంచి తప్పుకోవాల్సి రావడం కొంత నిరాశ కలిగించినప్పటికీ, అలాంటి పరిణామాలను కెరీర్‌లో సహజంగానే స్వీకరిస్తానని తెలిపింది. ప్రతి విషయం మనం అనుకున్నట్లే జరగదని, అందుకే గతాన్ని తలచుకుని బాధపడకుండా ముందుకు సాగడంపైనే తన దృష్టి కేంద్రీకరించానని పేర్కొంది. 'మిరాయ్' సినిమా తనలోని నటిగా మరో కొత్త కోణాన్ని ప్రేక్షకులకు పరిచయం చేసిందని చెప్పిన రితికా, ఆ చిత్రం తర్వాత విభిన్నమైన పాత్రలు చేయాలనే ఆసక్తి మరింత పెరిగిందని వెల్లడించింది. ప్రేక్షకులను ఆశ్చర్యపరిచే కథలు, బలమైన పాత్రలను ఎంచుకోవాలని భావిస్తున్నానని, కథలో తన పాత్రకు ప్రాధాన్యం ఉండటమే తనకు అత్యంత ముఖ్యమని స్పష్టం చేసింది. భవిష్యత్తులో నటిగా తన వైవిధ్యాన్ని చాటిచెప్పే పాత్రలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తానని రితికా నాయక్ వెల్లడించింది.

## 'డ్రాగన్'లో ఎన్టీఆర్ పవర్‌ఫుల్ రోల్



యంగ్ టైగర్ ఎన్టీఆర్ , సంచలన దర్శకుడు ప్రశాంత్ నీల్ కలయికలో తెరకెక్కుతున్న హై–వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'డ్రాగన్'. ఈ మోస్ట్ అవైటెడ్ కాంబినేషన్ కోసం నందమూరి అభిమానులతో పాటు యావత్ సినీ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా, వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు. ప్రశాంత్ నీల్ మార్క్ ఎలివేషన్స్, ఎన్టీఆర్ పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్ కలబోసి వస్తున్న ఈ సినిమాపై ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం, ఈ సినిమా అప్‌డేట్స్ కోసం వేచి చూస్తున్న ఫ్యాన్స్‌కు దర్శకుడు ప్రశాంత్ నీల్ ఒక అదిరిపోయే యాక్షన్ ఎపిసోడ్‌ను ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో వచ్చే ఇంటర్వెల్ బ్లాక్ యాక్షన్ సీన్స్ ప్రేక్షకులను థియేటర్లలో సీట్ల నుంచి లేచి నిలబడేలా చేస్తాయని సమాచారం. అభిమానుల అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా, వారిని పూర్తిగా దృష్టిలో పెట్టుకుని ప్రశాంత్ నీల్ ఈ భారీ యాక్షన్ ఎపిసోడ్‌ను ఎంతో ప్రతిష్టాత్మకంగా డిజైన్ చేశారట. ఈ ఇంటర్వెల్‌లో తారక్ విధ్వంసక నటన, సరికొత్త యాక్షన్ స్టంట్స్ నెక్స్ట్ లెవెల్‌లో ఉండబోతున్నాయని టాక్. గతంలో ప్రశాంత్ నీల్ సినిమాల్లోని ఇంటర్వెల్ సీన్స్ ఎంతటి సంచలనం సృష్టించాయో అందరికీ తెలిసిందే. ఇప్పుడు ఎన్టీఆర్‌తో అంతకుమించిన భారీ యాక్షన్ విందును ఆయన సిద్ధం చేస్తున్నట్లు వినికిడి. ఇక ఇటీవల విడుదలైన ఈ సినిమా గ్లింప్స్ వీడియో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ గ్లింప్స్‌లో కథలోని అనేక కీలక పాత్రలను ప్రశాంత్ నీల్ పరిచయం చేసినప్పటికీ, అసలు కథకు మూలమైన మెయిన్ కాన్ఫ్లిక్ట్‌ను మాత్రం రివీల్ చేయకుండా చాలా సస్పెన్స్‌గా ఉంచారు. ఈ మెయిన్ కాన్ఫ్లిక్ట్ చుట్టూ తిరిగే కథాంశంలోనే హీరోయిన్ కృతి సనన్ క్యారెక్టర్ డా ఎంట్రీ ఇస్తుందని తెలుస్తోంది. కథను మలుపు తిప్పే అత్యంత కీలకమైన ట్రాక్‌లో ఆమె పాత్ర కనిపించబోతుండటంతో, సినిమాలో కృతి సనన్ పాత్ర ప్రాధాన్యతపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. సాధారణంగా ప్రశాంత్ నీల్ సినిమా అనగానే అందరికీ ఫుల్ బ్లాక్ అండ్ గ్రే షేడ్ ఫ్రేమ్స్, డార్క్ థీమ్స్ మాత్రమే ఎక్కువగా గుర్తుకొస్తాయి. కానీ ఎన్టీఆర్ 'డ్రాగన్' విషయంలో ఆయన తన రూట్ మార్చినట్లు తెలుస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా అత్యంత భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రానికి రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. ఈ క్రేజీ చిత్రాన్ని వచ్చే ఏడాది జూన్ 11న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి తీసుకురాబోతున్నారు.

### ఇరుముడితో బిజీ..
## అయినా కొత్త సినిమాపై దృష్టి



మాస్ మహారాజా రవితేజ వరుస ప్రాజెక్ట్‌లతో దూసుకుపోతున్నారు. ఈ ఏడాది సంక్రాంతికి ప్రేక్షకులను అలరించిన ఆయన, ఇప్పుడు మరోసారి బిజీ షెడ్యూల్‌తో అభిమానులకు వరుస సినిమాలను అందించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం నటిస్తున్న ఆధ్యాత్మిక యాక్షన్ డ్రామా 'ఇరుముడి' చివరి దశ షూటింగ్‌లో ఉండగానే, మరో కొత్త ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగు తోంది. తాజా సమాచారం ప్రకారం, 'రాజా రాజా చోర' ఫేమ్ దర్శకుడు హసిత్ గోలి దర్శకత్వంలో రవితేజ ఓ వినోదాత్మక చిత్రంలో నటించనున్నారని తెలుస్తోంది. ఈ సినిమాలో టాలెంటెడ్ హీరో శ్రీవిష్ణు డా కీలక పాత్రలో కనిపించే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. హసిత్ గోలి శైలికి తగ్గట్టుగా హాస్యం, వినూత్న కథనం ప్రధాన బలాలుగా ఈ చిత్రాన్ని రూపొందించనున్నట్లు సమాచారం. ఈ నెలలో పూజా కార్యక్రమాలతో సినిమాను ప్రారంభించి, వచ్చే నెల నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారట. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా చిత్రాన్ని విడుదల చేయాలని మేకర్స్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు టాక్ వినిపిస్తోంది. అయితే ఈ మల్టీస్టారర్ ప్రాజెక్ట్‌పై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. ఇదిలా ఉంటే, రవితేజ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఇరుముడి' చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న ఈ సినిమా భక్తి, కుటుంబ భావోద్వేగాలు, యాక్షన్ అంశాల మేళవింపుగా రూపొందుతోంది. ఈ చిత్రాన్ని ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు ఇప్పటి ప్రకటించారు. ఈ సినిమాలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటిస్తుండగా, మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. జి.వి. ప్రకాష్ కుమార్ అందించిన సంగీతం, కళ్యాణ్ చక్రవర్తి రచించిన సాహిత్యం, గాయకుడు అనంతు ఆలపించిన తీరు పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

## చిరంజీవి - బాబీ మూవీలో మాస్ యాక్షన్

మెగాస్టార్ చిరంజీవి హీరోగా దర్శకుడు కొల్లి బాబీ తెరకెక్కిస్తున్న భారీ చిత్రం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోంది. వాల్తేరు వీరయ్య బ్లాక్‌బస్టర్ విజయానంతరం వీరి కలయికలో వస్తున్న చిత్రం కావడంతో అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అలాగే డాకు మహారాజ్ తర్వాత బాబీ నుంచి వస్తున్న ప్రాజెక్ట్ కావడంతో సినీ వర్గాల్లోనూ ఆసక్తి పెరిగింది. ఇప్పటికే పొల్లాచ్చిలో తొలి షెడ్యూల్‌ను పూర్తి చేసుకున్న చిత్రబృందం ప్రస్తుతం హైదరాబాద్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తోంది. ఈ షెడ్యూల్‌లో హై వోల్టేజ్ మాస్ యాక్షన్ ఎపిసోడ్‌ను తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. ప్రముఖ ఫైట్ మాస్టర్లు రామ్ – లక్ష్మణ్ ఈ యాక్షన్ సీక్వెన్స్‌ను డిజైన్ చేసినట్లు తెలుస్తోంది. మెగాస్టార్ అభిమానులకు గూస్‌బంప్స్ ఇచ్చే స్థాయిలో ఈ ఎపిసోడ్ ఉండనుందని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ఈ చిత్రానికి సంగీతాన్ని ఎస్. థమన్ అందిస్తుండగా, కేవీఎన్ ప్రొడక్షన్స్ భారీ స్థాయిలో నిర్మిస్తోంది. త్వరలోనే చిత్రానికి సంబంధించిన మరిన్ని విశేషాలను అధికారికంగా వెల్లడించే అవకాశం ఉంది.

## నాగార్జున 100వ సినిమాలో టబూ



టాలీవుడ్ కింగ్ నాగార్జున కెరీర్‌లో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కనున్న 100వ సినిమాపై అభిమానుల్లో రోజురోజు ఆసక్తి పెరుగుతోంది. ఇటీవల అక్కినేని అఖిల్ నటించిన 'లెనిన్' ప్రీ–రిలీజ్ ఈవెంట్‌లో పాల్గొన్న నాగార్జున, తన మైలురాయి చిత్రం కింగ్100 కు సంబంధించిన అధికారిక అప్‌డేట్‌ను జులై 10 తర్వాత వెల్లడిస్తానని ప్రకటించారు. దీంతో ఈ ప్రాజెక్ట్‌పై సోషల్ మీడియాలో చర్చలు మరింత వేగం పుంజుకున్నాయి. ఇప్పటివరకు చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రాకపోయినా, ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తున్న తాజా వార్తలు అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని పెంచుతున్నాయి. ముఖ్యంగా ఈ సినిమాలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ టబూ కీలక పాత్రలో కనిపించనున్నట్లు, అంతేకాదు ఆమె ఈసారి నెగెటివ్ షేడ్స్ ఉన్న ప్రధాన ప్రతినాయక పాత్రను పోషించే అవకాశముందని ప్రచారం జరుగుతోంది. గతంలో నాగార్జున, టబూ కలిసి నటించిన సినిమాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. వారి ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీకి ప్రత్యేక అభిమానులు ఉన్నారు. అందు ఈసారి డా ఇద్దరూ జంటగా కనిపిస్తారని చాలామంది భావించారు. అయితే తాజా ప్రచారం ప్రకారం, టబూ ఈ చిత్రంలో హీరోయిన్‌గా కాకుండా నాగార్జునకు ఎదురుగా నిలిచే ప్రధాన ప్రతినాయకురాలి పాత్రలో నటించనున్నట్లు సమాచారం. ఈ వార్త నిజమైతే, ఇద్దరూ తొలిసారి పూర్తిగా భిన్నమైన పాత్రల్లో తలపడే అవకాశం ఉంటుంది. తండ్రి–తురు మధ్య సాగే భావోద్వేగ కథ ఈ సినిమాకు ప్రధాన బలంగా ఉండనుందని టాక్. ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ నిర్మిస్తుండగా, యువ నటి సుష్మిత భట్ కీలక పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. భారీ స్థాయిలో ఈ ప్రాజెక్ట్‌ను రూపొందించేందుకు మేకర్స్ ఇప్పటి పలుమాసాలుగా సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. టైటిల్, నటీనటులు, ఫస్ట్ లుక్, షూటింగ్ అప్‌డేట్స్ వంటి కీలక విషయాలపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## 'లెనిన్' సరసన భాగ్యశ్రీ



చాలా కాలంగా సరైన బ్రేక్ కోసం ఎదురుచూస్తున్న యాక్టర్లలో ఒకడు టాలీవుడ్ నటుడు అక్కినేని అఖిల్. ఈ సారి ఎలాగైనా హిట్టు కొట్టాలని మేకోవర్ మార్చుకుని లాంగ్ గ్యాప్ తర్వాత 'లెనిన్'గా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు అఖిల్. మురళీ కిషోర్ అబ్బూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మిస్టర్ బచ్చన్ ఫేం భాగ్య శ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ మూవీ జులై 10న గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో చిత్రయూనిట్ చెప్పిన మాటలు లెనిన్ గ్రాండ్ సక్సెస్ అవడం పక్కా అని ఫుల్ కాన్ఫిడెన్స్‌తో ఉన్నట్టు చెప్పకనే చెబుతున్నాయి. ఇదిలా ఉంటే సినిమా థియేటర్లలోకి రాకముందే అప్పుడే ఓటీటీ రిలీజ్‌కు సంబంధించిన ఆసక్తికర వార్తను షేర్ చేశారు మేకర్స్. లెనిన్ పోస్ట్ థియాట్రికల్ రైట్స్‌ను పాపులర్ టెలివిజన్ నెట్‌వర్క్ జీ దక్కించుకుంది. జీ నెట్‌వర్క్ లెనిన్ మూవీ డిజిటల్, శాటిలైట్ రైట్స్‌ను దక్కించుకుంది. థియాట్రికల్ రన్ తర్వాత జీ5లో ప్రీమియర్ కానుంది. అంతేకాదు జీ తెలుగు, జీ సినిమాలులో టెలివిజన్ ప్రీమియర్ కానుంది. ఆయా ప్లాట్‌ఫాంలలో విడుదల తేదీలపై మేకర్స్ థియాట్రికల్ రిలీజ్ తర్వాత క్లారిటీ ఇవ్వనున్నారు. ఈ మూవీని అన్నపూర్ణ స్టూడియోస్తోపాటు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, నాగ వంశీ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. రొమాంటిక్ యాక్షన్ డ్రామాగా వస్తున్న ఈ చిత్రంలో శివాజీ, సునీల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటి విడుదలైన లెనిన్ టైటిల్ గ్లింప్స్ మూవీ విలేజ్ బ్యాక్‌డ్రాప్ నేపథ్యంలో సాగనున్నట్టు హింట్ ఇచ్చేసింది.

## నిర్మాతగా ప్రదీప్ రంగనాథ్ కొత్త అవతారం



వరుస విజయాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న తమిళ యువ నటుడు, దర్శకుడు ప్రదీప్ రంగనాథ్ ఇప్పుడు నిర్మాతగా అవతారం ఎత్తబోతున్నారు. లవ్ టుడే, డ్రాగన్ వంటి చిత్రాలతో బాక్సాఫీస్ వద్ద రూ.100 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన ఆయన, ఇటీవల విడుదలైన సినిమాతో మాత్రం ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయారు. ఈ సినిమా నిరాశపరిచినప్పటికీ ప్రదీప్ ఏమాత్రం వెనక్కి తగ్గకుండా కొత్త ప్రయాణానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటి నటుడు, దర్శకుడు, కథా రచయిత, గేయ రచయితగా తన ప్రతిభను చాటుకున్న ప్రదీప్ రంగనాథన్.. ఇప్పుడు నిర్మాతగానూ అడుగుపెడుతున్నారు. తాజాగా పీఆర్ షో అనే సొంత నిర్మాణ సంస్థను ప్రారంభించిన ఆయన, ఆ బ్యానర్‌పై తొలి చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రంలో 'ప్రేమలు', 'డ్యూడ్' చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న మమిత బైజు కథానాయికగా నటిస్తోంది. దర్శకుడిగా పేరు తెచ్చుకుని, ప్రస్తుతం నటుడిగానూ రాణిస్తున్న అశ్వత్ మారిముత్తు కీలక పాత్ర పోషిస్తున్నారు. అలాగే ఈ సినిమాతో అనామిక మహి వెండితెరకు పరిచయం కానుండగా, తెలుగు నటుడు శివాజీ సొంటినేని, నటి స్వాసిక ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు.ఈ చిత్రానికి మరో ప్రత్యేక ఆకర్షణ 'ది ఆల్ఫా యూనిట్'. ఆరుగురు యువ దర్శకులతో ఫిల్మ్‌మేకింగ్ చేయడం. విశాల్ టీఆర్, యశ్ వి, నరేన్ సాదా, చాణక్యన్ ఆర్, ధనుష్ కుమార్, ఇళంపరితి ఈ సినిమాకు సంయుక్తంగా దర్శకత్వం వహించనున్నారు. ఈ వినూత్న ప్రయత్నం సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ చిత్రానికి కథను స్వయంగా ప్రదీప్ రంగనాథన్ అందించగా, యువ సంగీత దర్శకుడు సాయి అభ్యంకర్ సంగీతం సమకూర్చుతున్నారు. సినిమా ప్రకటన సందర్భంగా విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ వీడియో ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచింది. ఇందులో నటీనటులు, సాంకేతిక బృందాన్ని పరిచయం చేస్తూ సినిమాపై మంచి బజ్ క్రియేట్ చేశారు.నిర్మాతగా ప్రదీప్ రంగనాథన్ ప్రారంభిస్తున్న ఈ కొత్త ప్రయాణం ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి.

## అఖిల్ సినిమాకు స్పెషల్ అట్రాక్షన్





కథానాయకుడు అక్కినేని అఖిల్ నటించిన తాజా చిత్రం లెనిన్ విడుదలకు సిద్ధమైంది. దర్శకుడు మురళీ కిశోర్ అబ్బూరు తెరకెక్కించిన ఈ చిత్రాన్ని అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మించారు. కథానాయికగా భాగ్యశ్రీ బోర్సే నటించగా, శివాజీ, సునీల్ కీలక పాత్రలు పోషించారు.ఈ నెల 10న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా గురించి చిత్ర బృందం ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించింది. స్టార్ హీరో ఎన్టీఆర్ ఈ చిత్రానికి వాయిస్ ఓవర్ అందించినట్లు ప్రకటించింది. ఆయన గంభీరమైన స్వరంతో సినిమా కథతో పాటు శ్రీరామపురం నేపథ్యాన్ని ప్రేక్షకులకు పరిచయం చేయనున్నట్లు తెలిపింది.ఇప్పటికే ఎన్టీఆర్ తన డబ్బింగ్ భాగాన్ని పూర్తి చేసినట్లు వెల్లడించిన చిత్ర యూనిట్, దీనికి సంబంధించిన ఫొటోలను కూడా విడుదల చేసింది. గ్రామీణ నేపథ్యంలో సాగే మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన 'లెనిన్' అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని, ఎన్టీఆర్ గాత్రం సినిమాకు మరింత బలం చేకూర్చే ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని చిత్ర వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

Published and Editor Owned by Adula Thirupathi, and Printed by vattemula Rama krishna, RK Printers Mig 11, Block No 16, Ground Floor 4, Baghlingampally, Hyderabad 500044. Telangana State. and Published from 16-11-13/A, saleemnagar colony, Malakpet, Hyderabad, Telangana State. **Editor: Adula Thirupathi.** **RNI NO : TGTEL/25/A4244** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277